**విలేకరులు కావలెను**

**మనవార్త దినపత్రిక లో పనిచేయుటకు విలేకరులు కావలెను**

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను

**Cell: 9666033186**
**9866092624**



# మన వార్త

ప్రజాగళానికి అక్షర రూపం

**MANA VAARTHA**

EPAPER.MANAVAARTHA.NET

MANA VAARTHA

Telangana | సంపుటి: 1, సంచిక: 250 | volume: 1, Issue:250 | గురువారం 09 ఏప్రిల్ 2026 పేజీలు : 8 వెల : 3.00

PRINTED: HYDERABAD PUBLISHED, KARIMNAGAR CMD&EDITOR:BHUPATHI SANTHOSH


## పశ్చిమాసియాలో శాంతి బాట



**న్యూఢిల్లీ:** అమెరికా మరియు ఇరాన్ దేశాల మధ్య కుదిరిన రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందాన్ని భారతదేశం అధికారికంగా స్వాగతించింది. పశ్చిమాసియా ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతలు తగ్గి, ఈ తాత్కాలిక ఒప్పందం శాశ్వత శాంతికి దారి తీస్తుందని భారత్ ఆశాభావం వ్యక్తం చేసింది. ఈ మేరకు కేంద్ర విదేశాంగ శాఖ న్యూఢిల్లీలో ఒక ప్రత్యేక ప్రకటనను విడుదల చేస్తూ, దౌత్యపరమైన చర్చల ద్వారానే సంక్లిష్ట సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పునరుద్ఘాటించింది. అంతర్జాతీయ సమాజం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈ పరిణామం ప్రపంచ శాంతికి శుభసూచకమని భారత ప్రభుత్వం అభిప్రాయపడింది. గత కొంతకాలంగా కొనసాగుతున్న ఈ యుద్ధ వాతావరణం వల్ల పశ్చిమాసియా ప్రాంతంలో నివసిస్తున్న సామాన్య ప్రజలు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొన్నారని విదేశాంగ శాఖ ఆవేదన వ్యక్తం చేసింది. నిత్యావసర వస్తువుల కొరతతో పాటు ప్రాణ, ఆస్తి నష్టం సంభవించడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ, కాల్పుల విరమణ వల్ల మానవతా దృక్పథంతో సహాయక చర్యలు చేపట్టడానికి వీలవుతుందని పేర్కొంది. అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థల్లో ఏర్పడిన అంతరాయం వల్ల రవాణా ఖర్చులు పెరిగి ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణంపై ప్రభావం పడిందని విదేశాంగ శాఖ తెలిపింది. తాజా ఒప్పందం వల్ల ఇంధన మార్కెట్లు తిరిగి స్థిరపడతాయని మరియు వాణిజ్య కార్యకలాపాలు యధావిధిగా కొనసాగుతాయని భారత్ విశ్వసిస్తోంది. అంతర్జాతీయ వాణిజ్యానికి అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి రక్షణ గురించి భారత్ తన ప్రకటనలో ప్రత్యేకంగా ప్రస్తావించింది. ప్రపంచ చమురు రవాణాలో అత్యధిక భాగం ఈ జలసంధి గుండానే జరుగుతుంది కాబట్టి, నౌకల రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు ఉండకూడదని స్పష్టం చేసింది. సముద్ర మార్గాల్లో భద్రత కల్పించడం వల్ల అంతర్జాతీయ నౌకాయాన రంగంపై నమ్మకం పెరుగుతుందని, ఇది అన్ని దేశాల ఆర్థిక ప్రయోజనాలకు అవసరమని పేర్కొంది. భారతీయ వాణిజ్య నౌకల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకుని, ఈ ప్రాంతంలో శాంతి నెలకొనడం భారత్‌కు వ్యూహాత్మకంగా చాలా ముఖ్యమని వెల్లడించింది. పశ్చిమాసియాలో శాంతి నెలకొల్పడానికి కృషి చేసిన మధ్యవర్తుల ప్రయత్నాలను భారత్ ఈ సందర్భంగా అభినందించింది. ఉద్రిక్తతలు తగ్గించడం ద్వారా అంతర్జాతీయ సంబంధాలు మెరుగుపడతాయని, ఇది ప్రపంచ సుస్థిరతకు దోహదపడుతుందని స్పష్టం చేసింది. భవిష్యత్తులో కూడా ఇరు దేశాలు సంయమనం పాటిస్తూ శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేయాలని భారత్ కోరింది. యుద్ధ మేఘాలు తొలగిపోవడం వల్ల ప్రపంచ ఆర్థిక మార్కెట్లు సానుకూలంగా స్పందిస్తాయని, తద్వారా అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఉపశమనం లభిస్తుందని ఆర్థిక మరియు దౌత్య నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## బంజారాలేక్‌పై హైడ్రా దృష్టి



**హైదరాబాద్:** ప్రజావాణి ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించి బంజారాహిల్స్‌లోని బంజారాలేక్ పరిస్థితిని సమీక్షించారు. తాజ్ బంజారా హోటల్ సమీపంలోని ఈ చెరువు ఆక్రమణలకు గురై తీవ్రంగా కలుషితమై దుర్గంధభరితంగా మారిందని స్థానికులు, ఎమ్మెల్యే దానం నాగేందర్ చేసిన ఫిర్యాదుల మేరకు ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో నిండిన ఈ సరస్సు ప్రస్తుతం చెత్త, మురుగు నీటితో నిండిపోవడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పరిశీలనలో భాగంగా చెరువులోకి నేరుగా మురుగు నీరు చేరడం, పై నుంచి చేరిన ప్లాస్టిక్ వ్యర్థాలతో చెరువు సగానికి పైగా నిండిపోవడం వంటి అంశాలను కమిషనర్ గమనించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో రహదారులు నిర్మించడం, వ్యర్థాలను పారబోసడం వల్ల చెరువు ఉనికి ప్రమాదంలో పడిందని తెలిపారు. అనంతరం శంషాబాద్ మండలం మామిడిపల్లి పరిసర ప్రాంతాల్లో మాయమైన చెరువులపై కమిషనర్ విచారణ చేపట్టారు. ఒంగోని కుంట, కనకయ్య కుంట, మద్రివాణి కుంట, ఎర్రకుంట వంటి చెరువులు ఆక్రమణలకు గురై అదృశ్యమయ్యాయనే ఫిర్యాదులను పరిశీలించారు. వరద కాలువలను మూసివేయడం వల్ల వర్షాకాలంలో నీరు నిలిచిపోతూ నివాస ప్రాంతాలు ముంపుకు గురవుతున్నాయని స్థానికులు వివరించారు. దీనిపై సంబంధిత అధికారులతో సమన్వయం చేసి పూర్తి సమాచారం సేకరించాలని కమిషనర్ ఆదేశించారు. ఆక్రమణదారులకు సూచనలు ఇచ్చి స్వచ్ఛందంగా తొలగించకపోతే హైడ్రా నేరుగా చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

## ప్రభుత్వ నర్సింగ్ కాలేజీల్లో మిడ్ వైఫరీ శిక్షణకు శ్రీకారం



**హైదరాబాద్:** రాష్ట్రంలో సహజ ప్రసవాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ నర్సింగ్ కాలేజీల్లో మిడ్ వైఫరీ శిక్షణ కేంద్రాలను త్వరలోనే ప్రారంభించనున్నట్లు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు. బోయగూడలోని మిడ్‌వైఫరీ శిక్షణ సంస్థలో నిర్వహించిన సురక్షిత మాతృత్వ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, సిజేరియన్ ప్రసవాలను తగ్గించి నార్మల్ డెలివరీలను పెంచడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మాతృత్వం మహిళలకు ఒక గొప్ప వరమని, ఈ ప్రయాణంలో వారికి సురక్షితమైన, గౌరవప్రదమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. గర్భిణీ ఆరోగ్యం అంటే శిశు ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, సమాజ అభివృద్ధికి పునాది అని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం లక్షలాది గర్భిణీలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమగ్ర వైద్య సేవలు అందిస్తున్నామని వివరించారు. ప్రతి గర్భిణీకి ఉచిత యాంటీనేటల్ పరీక్షలు, స్కానింగ్‌లు, అవసరమైన అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. నర్సింగ్ రంగాన్ని బలోపేతం చేయడానికి ఇప్పటికే 370 మంది నర్సులకు మిడ్ వైఫరీ శిక్షణ అందించామని, త్వరలోనే అన్ని ప్రభుత్వ నర్సింగ్ కాలేజీల్లో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. గత రెండు సంవత్సరాల్లో దాదాపు పది వేలకుపైగా ఉద్యోగాలను భర్తీ చేసి ఆరోగ్య వ్యవస్థను మరింత పటిష్ఠం చేశామని చెప్పారు. మరో రెండు రోజుల్లో 2322 నర్సింగ్ పోస్టుల భర్తీ పూర్తవుతుందని వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ అవకాశాల కోసం నర్సింగ్ విద్యార్థులకు ఇంగ్లీష్, జర్మన్, జపనీస్ భాషల్లో శిక్షణ కూడా అందిస్తున్నామని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు.

## ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహం



**పాలకుర్తి:** వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి పాలకుర్తి మండలం ఈసాల తక్కలపల్లి గ్రామంలో అదనంగా 150 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయడమే లక్ష్యంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. గ్రామంలో నిర్వహించిన ఆయిల్ పామ్ పంట సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఆయన, రైతులను ప్రోత్సహిస్తూ సాగు విస్తరణపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంట రైతులకు దీర్ఘకాలికంగా అధిక ఆదాయం అందించే లాభదాయక పంటగా నిలుస్తుందని తెలిపారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలు, సబ్సిడీలను వినియోగించుకుని రైతులు ఈ పంటను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే గ్రామంలో 150 ఎకరాల్లో సాగుకు రైతులు సిద్ధంగా ఉన్నప్పటికీ గత రెండు సంవత్సరాలుగా నాటడం జరగలేదని పేర్కొన్నారు. వచ్చే ఖరీఫ్‌లో తప్పనిసరిగా ఈ లక్ష్యాన్ని సాధించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. గ్రామంలో ప్రస్తుతం 210 మంది రైతులు 312 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారని పేర్కొంటూ, ఆయిల్ పామ్ నాటిన మొదటి మూడు సంవత్సరాల్లో మధ్యంతర పంటగా పత్తిని సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చని రైతులకు సూచించారు. రైతులకు తక్కువ ఖర్చుతో డ్రిప్ ఇరిగేషన్ సదుపాయం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యుత్ సరఫరా, బోర్‌వెల్లుల ఏర్పాటుకు కూడా సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం ఎకరాకు నాలుగు సంవత్సరాలపాటు సుమారు రూ. 52 వేల వరకు సబ్సిడీ అందిస్తున్నదని వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తొలి విడతలో లబ్ధి పొందిన రైతులు స్వప్న, చంద్రయ్యలకు రూ. 43 వేల విలువైన చెక్కులను కలెక్టర్ అందజేశారు. రైతులు శాస్త్రీయ పద్ధతులు పాటిస్తూ నాణ్యమైన మొక్కలను మాత్రమే నాటాలని, నీటి నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. మండల స్థాయిలో సాగు పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధికారి జగన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లడాఖ్‌లో మౌంటెనీరింగ్ శిక్షణ




**లడాఖ్:** లడాఖ్‌లోని మార్ఖా వ్యాలీ పరిధిలో మౌంట్ డ్జో జోంగోపై భారత సైన్యం నిర్వహించిన శీతాకాల మౌంటెనీరింగ్ శిక్షణ యాత్ర విజయవంతంగా పూర్తైంది. ఫైర్ అండ్ ఫ్యూరీ కార్ప్స్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16 నుంచి మార్చి 25 వరకు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ యాత్ర ద్వారా హై ఆల్టిట్యూడ్ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న సైనికుల మౌంటెనీరింగ్ నైపుణ్యాలు, ఆపరేషనల్ సిద్ధతను మెరుగుపరచడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. తీవ్ర వాతావరణ పరిస్థితుల్లో ఎలా పని చేయాలో, అత్యవసర పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో ఈ శిక్షణలో సైనికులు నేర్చుకున్నారు. మార్ఖా వ్యాలీ ప్రాంతం క్లిష్టమైన భౌగోళిక పరిస్థితులతో ఉండటంతో ఈ శిక్షణ సైనికులకు కీలక అనుభవాన్ని అందించింది. మంచు, తక్కువ ఆక్సిజన్ స్థాయిలు, తీవ్ర చలి వంటి పరిస్థితుల్లో సైనికులు తమ సామర్థ్యాలను పరీక్షించుకున్నారు. శిక్షణ ముగింపు కార్యక్రమం లేహ్‌లో నిర్వహించగా, ఫైర్ అండ్ ఫ్యూరీ కార్ప్స్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ మేజర్ జనరల్ సుధాంశు శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న సైనికులను ఆయన అభినందించారు. భారత సైన్యం సైనికుల సామర్థ్యాలను పెంపొందించేందుకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తోందని అధికారులు తెలిపారు. దేశ భద్రతకు అవసరమైన ప్రతి పరిస్థితిని ఎదుర్కొనేలా సైన్యం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

## కోమాలో ఉన్న భర్త వీర్యం కావాలి




**ఢిల్లీ:** కోమాలో ఉన్న తన భర్త నుండి వీర్యాన్ని సేకరించి నిల్వ చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఓ మహిళ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. భవిష్యత్తులో తన భర్త ద్వారానే తల్లిని కావాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆమె తన పిటిషన్‌లో పేర్కొన్నారు. బాధితురాలి భర్త 2025 మార్చి నెలలో తలకు తీవ్రమైన గాయం కావడంతో కోమాలోకి వెళ్లారని, అప్పటి నుండి ఆయన వెంటిలేటర్ సాయంతో ప్రాణాలతో ఉన్నారని న్యాయస్థానానికి వివరించారు. ఇటువంటి వినూత్నమైన కేసు విచారణకు రావడంతో న్యాయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఈ కేసులో వెలువడే తీర్పు భవిష్యత్తులో ఇటువంటి ఇతర కేసులకు మార్గదర్శకంగా నిలిచే అవకాశం ఉంది. న్యాయవ్యవస్థ ముందున్న ఈ ధర్మసంకటంలో మానవీయ కోణాన్ని మరియు చట్టపరమైన నిబంధనలను సమతుల్యం చేస్తూ న్యాయస్థానం ఎటువంటి తీర్పు ఇస్తుందనేది ఉత్కంఠగా మారింది. మహిళల పునరుత్పత్తి హక్కులకు సంబంధించిన అంశం కావడంతో మహిళా సంఘాలు కూడా ఈ కేసును గమనిస్తున్నాయి. గురువారం జరిగే విచారణలో మెడికల్ బోర్డు ఏర్పాటుపై కోర్టు తన నిర్ణయాన్ని వెల్లడించే అవకాశం ఉంది. ఢిల్లీకి చెందిన ఈ మహిళ న్యాయపోరాటం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

## పేదవారి సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం...

**-సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి...**

**గజ్వేల్, ఏప్రిల్ 08 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం బెజుగామ గ్రామంలో బుధవారం నిర్వహించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇంట జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొని, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆంక్షరెడ్డి మాట్లాడుతూ ప్రతి పేదవాడికి సొంత ఇల్లు ఉండాలన్నదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, అది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గూడు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజా పాలనలో సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నక్కీర్త గోపాల్ బెజుగామ గ్రామ సర్పంచ్, నాయిని యాదగిరి రాష్ట్ర పీసీసీ కార్యదర్శి, నరేందర్ రెడ్డి గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్, విరూపాక శ్రీనివాస్ రెడ్డి కొండపాక మార్కెట్ కమిటీ చైర్మన్, సర్దార్ ఖాన్ గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శివారెడ్డి, శ్రీనివాస్, నక్క రాములు, సర్పంచ్లు అశోక్ రెడ్డి, వెంకట్ రెడ్డి, చెన్నరెడ్డి, మల్లేశం, కళ్యాణి ప్రశాంత్, నాయకులు, గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## డాక్టరు అన్నపూర్ణకు రాష్ట్రస్థాయి పురస్కారం

**– ఘనంగా సన్మానించిన వైద్యులు, నర్సింగ్, ఇతర సిబ్బంది**

**గజ్వేల్, ఏప్రిల్ 08 మన వార్త ప్రతినిధి** ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్యారోగ్య శాఖలో విశేష ప్రతిభ కనబరిచిన వారికి అందజేసే రాష్ట్రస్థాయి పురస్కారానికి సిద్దిపేట జిల్లా, గజ్వేల్ జిల్లా కేంద్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైద్యులు, నర్సింగ్ మరియు ఇతర సిబ్బంది ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ప్రతిష్టాత్మక పురస్కారం లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం కేవలం తన ఒక్కరి కృషి వల్ల సాధ్యం కాలేదని, ఆసుపత్రిలోని ప్రతి ఒక్క ఉద్యోగి అంకితభావానికి దక్కిన గౌరవమని పేర్కొన్నారు. వైద్యులు, నర్సింగ్ స్టాఫ్, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, పారామెడికల్ మరియు శానిటేషన్ సిబ్బంది అంతా ఒక కుటుంబంలా కలిసి పనిచేయడం వల్లే ఈ గుర్తింపు లభించింది. ఈ అవార్డు నాపై బాధ్యతను మరింత పెంచిందన్నారు. సిద్దిపేట జిల్లాను వైద్యారోగ్య రంగంలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. తమకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సతీష్ హెల్త్ అసిస్టెంట్ దేవసాని వాసుదేవ్ ప్రభాకర్, చీఫ్ వీడియో గ్రాఫర్ విద్యాసాగర్ ఎక్స్ డిపార్ట్మెంట్ నర్సింగ్ ఆఫీసర్స్, షాహిన్, ఉమామహేశ్వరి, నజీర్ అహ్మద్ ,గౌతమ్, ఇన్ఫెక్షన్ కంట్రోల్ నర్సింగ్ ఆఫీసర్ మేహారాజ్ భాను, ఎల్. డి కంప్యూటర్ దుర్గా ప్రసాద్, ఆరోగ్య మిత్ర సురేందర్, ఎం.ఆర్.డి. రికార్డ్ సెక్షన్ ఇంచార్జ్ సుధాకర్ థియేటర్ అసిస్టెంట్ వెంకటేష్. ల్యాబ్ టెక్నీషియన్స్ రమేష్, జీవన, రచన, కనకయ్య, 108 ఈ.ఎం.టి పైలెట్స్ పరశురాములు, ఆరోగ్యం, రఘుపతి బాలయ్య, శానిటేషన్ సూపర్వైజర్ శేఖర్, సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.



## బెజుగామ గ్రామస్తుల కల సాకారం...

**– ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని ప్రారంభించిన డిసిసి అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి...**

**గజ్వేల్ ఏప్రిల్ 08 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం బెజుగామ గ్రామ ప్రజల దశాబ్దాల నిరీక్షణకు తెరపడింది. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక సహకారంతో, బెజుగామ నుండి గజ్వేల్ వరకు ఏర్పాటు చేసిన నూతన ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి బుధవారం ప్రారంభించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె రిబ్బన్ కట్ చేసి, బస్సును జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి తొలి ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా ఆంక్ష రెడ్డి మాట్లాడుతూ గ్రామస్థుల రవాణా ఇబ్బందులను గుర్తించి, రవాణా మంత్రి దృష్టికి తీసుకెళ్లగా వారు సానుకూలంగా స్పందించి ఈ బస్సు సౌకర్యాన్ని కల్పించారన్నారు. విద్యార్థులు, రైతులు, చిరు వ్యాపారులకు ఈ బస్సు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, ప్రజల అవసరాలను తీర్చడమే మా ప్రభుత్వ లక్ష్యం అన్నారు. బస్సు సౌకర్యం కల్పించడంపై బెజుగామ గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వానికి, ఆర్టీసీ అధికారులకు, ఆంక్ష రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బెజుగామ గ్రామ సర్పంచ్ నక్కీర్త గోపాల్, నాయిని యాదగిరి రాష్ట్ర పీసీసీ కార్యదర్శి, నరేందర్ రెడ్డి గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్, విరూపాక శ్రీనివాస్ రెడ్డి కొండపాక మార్కెట్ కమిటీ చైర్మన్, సర్దార్ ఖాన్ గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శివారెడ్డి, శ్రీనివాస్, నక్క రాములు, సమీర్, సర్పంచ్లు అశోక్ రెడ్డి, వెంకట్ రెడ్డి, చెన్నరెడ్డి, మల్లేశం, కళ్యాణి ప్రశాంత్, నాయకులు, గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, గ్రామ పంచాయతీ ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## డి హెచ్ పి ఎస్ మహాసభలను విజయవంతం చేయండి




**ఎల్కతుర్తి ఏప్రిల్ 8 మనవార్త ప్రతినిధి** దళిత హక్కుల పోరాట సమితి (DHPS) రెండవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ఎల్కతుర్తి మండలంలో బుధవారం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డి హెచ్ పి ఎస్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల మనోహర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన 76 సంవత్సరాలు గడిచినా దళితులు ఇంకా అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి బడ్జెట్లో దళితులకు 20 శాతం నిధులు కేటాయించాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగంలో సూచించినప్పటికీ అమలులో లోపాలు ఉన్నాయని అన్నారు. దళితులకు కేటాయించాల్సిన నిధులు ఇతర శాఖలకు మళ్లిస్తున్నారని ఆరోపిస్తూ ఎస్సీ ఎస్టీ సబ్ప్లాన్ పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఇల్లు లేని దళితులకు ఇందిరమ్మ ఇళ్లలో 50 శాతం వాటా పారదర్శకంగా కల్పించాలని కోరారు. ఏప్రిల్ 17 18 తేదీలలో వరంగల్ లో జరిగే డి హెచ్ పి ఎస్ రెండవ రాష్ట్ర మహాసభలకు హనుమకొండ జిల్లా గ్రామ మండల స్థాయి నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మరి శ్రీనివాస్, శనిగరపు రాజకుమార్ తాండ ముండయ్య ప్రకాష్ రాజు కొమురయ్య తదితరులు పాల్గొన్నారు

## కౌన్సిలర్ గుంటుకు లక్ష్మీ శ్రీనివాస్‌కు నీలం మధు ముదిరాజ్ అభినందనలు



**గజ్వేల్, ఏప్రిల్ 08 మన వార్త ప్రతినిధి** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా 14వ వార్డు కౌన్సిలర్‌గా ఘన విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గుంటుకు లక్ష్మీ శ్రీనివాస్‌ను కాంగ్రెస్ సీనియర్ నాయకులు నీలం మధు ముదిరాజ్ బుధవారం రోజు అభినందించారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా, వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై ప్రజలు ఉంచిన నమ్మకానికి ఈ విజయం నిదర్శనమని పేర్కొన్నారు.

## ఎల్లారెడ్డిపేట ప్రజల ను ఎప్పటికి మరిచిపోను మాజీ పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్



**ఎల్లారెడ్డి పేట ఏప్రిల్ 08:(మన వార్తా ప్రతినిధి )** ఎల్లారెడ్డిపేట గ్రామ ప్రజలను ఎప్పటికీ మర్చిపోనని, వారి మద్దతు తో మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా పూర్తిస్థాయిలో బాధ్యతలు నిర్వహించానని మాజీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ లో కార్యదర్శిగా విధులు నిర్వహించి ఇటీవల బదిలీపై వెళ్లిన ప్రవీణ్ కుమార్ ను సర్పంచ్ ఎలగందుల నర్సింలు, ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బందారపు బాల్రెడ్డి, వార్డు సభ్యులు ఎలగందుల అంజలి ధ్యాగం నారాయణ, అంతర్పుల గోపాల్, అంగూరి ప్రవీణ్, చెన్నయ్య, సాయికిరణ్, గంట బాలు, ఆంజనేయులు, నాతోపాటు గ్రామపంచాయతీ నూతన కార్యదర్శి కృష్ణ, నరేష్ బాలకిషన్, రామచంద్రంతోపాటు మాజీ కోఆప్షన్ హాసన్ భాయ్ తదితరులు పాల్గొన్నారు

## సీఎం సీటుపై హరీష్ రావు కన్ను...

**–భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కామెంట్స్...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 08** రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేయడానికి బిఆర్ఎస్ నేత హరీష్ రావు విఫలయత్నం చేస్తున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. బుధవారం రోజు గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బిఆర్ఎస్ , బిజెపి నేతల తీరుపై నిప్పులు చరిగారు. బిఆర్ఎస్ ఎప్పటికీ అధికారం కోల్పోదని హరీష్ రావు కలలు కంటున్నారని , కెసిఆర్ తర్వాత తానే ముఖ్యమంత్రి కావాలని ఆశపడ్డాట్లు ఎంపీ చామల ఎద్దేవా చేశారు. కేటీఆర్ వల్ల ఏమీ కాదని హరీష్ రావు సీఎం సీటుపై కన్నేశారు. కానీ ప్రజలు వారిని పక్కన పెట్టారని చామల అన్నారు. 2014 , 2018 మేనిఫెస్టోలో బిఆర్ఎస్ పెట్టిన వాగ్దానాలపై తాము ఎక్కడైనా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలపై బిఆర్ఎస్ నేతలు మాట్లాడిన వెంటనే అదే అంశంపై బీజేపీ నేతలు గొంతు కలపడం వారి మధ్య ఉన్న ఐక్యతకు , అవగాహన కు నిదర్శన మని పేర్కొన్నారు. 2014 నుంచి కేంద్రంలో బీజేపీ ప్రజలను తప్పు త్రోవ పట్టించి అధికారంలోకి వచ్చిందని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని , నల్లధనాన్ని వెలికి తీస్తామన్న హామీ ఏమైందని కేంద్రాన్ని ప్రశ్నించారు. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తామని చెప్పి మోసం చేసింది అప్పటి కెసిఆర్ ప్రభుత్వం కాదా..? ఇప్పటివరకు ఎన్ని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చారు..? ఎంతమంది దళితులకు మూడెకరాల భూమిని పంపిణీ చేశారు..? అని ఎంపీ చామల ప్రశ్నలను సంధించారు. గత పది ఏళ్లలో బిఆర్ఎస్ కనీసం 30 శాతం హామీలను కూడా అమలు చేయలేక పోయిందని , రాష్ట్రాన్ని లక్షల కోట్ల రూపాయల అప్పుల్లోకి నెట్టడం తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పదేళ్లుగా పార్లమెంట్ సభ్యులుగా ఉండి ఏం చేశారని ఎంపీ చామల ప్రశ్నించారు. బిఆర్ఎస్ దోపిడీని అడ్డుకోలేక పోయినందునే ప్రజలు బిజెపిని కాదని కాంగ్రెస్ కు అధికారం కట్టబెట్టారన్నారు. కేవలం పత్రికల్లో పేరు కోసమే బండి సంజయ్ ప్రభుత్వంపై అసత్యపు ప్రచారాలు చేస్తున్నారని భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు.





## బంగారు పుష్పాలతో శ్రీవారికి అష్టదళ పాదపద్మార్చన...

**–అంగరంగ వైభవంగా శ్రీనివాసుడి నిత్య కళ్యాణం...**

**–కన్నుల పండుగగా స్వర్ణగిరీశునికి తీరు వీది ఉత్సవ సేవ...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 08** తెలంగాణలోని ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన యాదాద్రి తిరుమల స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం లో బుధవారం రోజు ఉదయం 108 బంగారు పుష్పాలతో అష్టాదశ పద్మార్చన సేవను ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నిత్య కళ్యాణోత్సవాన్ని ఆలయ ప్రదాన అర్చకులు దిట్టకవి శ్రవణా చార్యులు దివ్య కరములచే అంగరంగ వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు , ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ఠ దర్శనాన్ని భక్తులకు కల్పించారు. ఉదయం 5:45 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామివారికి నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో సువర్ణ బిందె తీర్థంను బంగారు బావి నుండి శ్రద్ధాభక్తులతో తీసుకువచ్చారు. ఉదయం 7 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మణిమయ శోభిత స్వర్ణాభరణాలతో, పరిమళభరిత పుష్పమాలల తో శోభాయమానంగా అలంకరించి , వేయి నామాలతో శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. సకల దోష నివారణార్థం అమావాస్యని పురస్కరించుకొని అర్చకులు శ్రీ సుదర్శన నారసింహ హవనాన్ని ఘనంగా నిర్వహించారు. బుధ వారం సందర్భంగా స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య పాదార విందములకు ఒక వంద ఎనిమిది బంగారు అష్టదళ పద్మ పుష్పాలతో , శ్రీ స్వామివారికి అష్టోత్తర శతనామాలతో అష్టదళ పాదపద్మార్చన సేవను నిర్వహించారు. భక్తులు శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ఆనంద పరవశు లయ్యారు. స్వామి వారి నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో భాగంగా నేడు సుమారు 2500 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం 6:30 గంటలకు ఆదిమధ్యాంతరహితుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో శోభాయమానంగా ఊరేగిస్తూ తిరువీధి ఉత్సవ సేవను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. ఈరోజు శ్రీ స్వామివారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు ఆలయ చైర్మన్లు మానేపల్లి మురళీకృష్ణ గోపికృష్ణలు తెలిపారు.



## ప్రభుత్వ స్థలంలోనే మహిళా సంఘ భవనం నిర్మించాలి



**– ఎంపీడీవో కు వినతిపత్రం అందజేసిన ఉప సర్పంచ్: రాజేష్...**

**శంకరపట్నం:ఏప్రిల్08(మనవార్త ప్రతినిధి)**శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలో ప్రభుత్వ స్థలంలోనే మహిళా సంఘ భవనం నిర్మించాలని ఎంపీడీవో కృష్ణ ప్రసాద్ కు మొలంగూర్ ఉప సర్పంచ్ దండు రాజేష్ వినతిపత్రం అందజేశారు. మొలంగూర్ గ్రామంలోని 703 సర్వే నెంబర్ లో మహిళా సంఘం భవనం నిర్మాణానికి రెవెన్యూ అధికారులు స్థలాన్ని కేటాయించి,పంచనామ కాపీని సర్పంచ్ కు అందజేశారు. ఈ స్థలంలోనే గ్రామ మహిళా సంఘం భవనం నిర్మించాలని ఉప సర్పంచ్ తో పాటు వార్డు సభ్యులు అంగీకారం కాగా సర్పంచ్ మాత్రం గ్రామపంచాయతీ భవనం సమీపంలోనే నిర్మించాలని పట్టుపట్టడంతో భవిష్యత్తులో స్థలానికి ఇబ్బందులు ఉంటాయని పాలకవర్గం సభ్యులు అభ్యంతరం చెప్పారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు కేటాయించిన 703 సర్వే నెంబర్ లో మహిళా సంఘం భవనం నిర్మాణానికి గ్రామపంచాయతీ అనుమతులు ఇప్పించాలని ఉప సర్పంచ్ దండు రాజేష్ తో పాటు మెజార్టీ వార్డు సభ్యులు సంతకాలు చేసిన తీర్మాణ ప్రతిని ఉప సర్పంచ్ ఎంపీడీవోకు అందజేశారు.

## ఉపాధ్యాయురాలిగా విద్యాబోధన చేసిన కలెక్టర్ ప్రతిమాసింగ్...

**రామాయంపేట ఏప్రిల్ 8( మన వార్త ప్రతినిధి)** రామాయంపేట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు, పాఠశాలలో నెలకొన్న సమస్యలపై అడిగి తెలుసుకున్నారు, నీటి సమస్య ఉన్నందున వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు, పాఠశాలలో విద్యార్థులకు విద్యాబోధన చేసి పలు ప్రశ్నలకు విద్యార్థులచే సమాధానాలు రాబట్టారు, నాణ్యమైన విద్యతోపాటు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలని సూచించారు, అనంతరం దామరచెరువు ప్రాథమికోన్నత పాఠశాల తో పాటు రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు పాఠశాలలో సమస్యలను అడిగి తెలుసుకుని ప్రధానోపాధ్యాయులు పై ఆగ్రహం వ్యక్తం చేశారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తూ నాణ్యమైన భోజనాన్ని అందించడం జరుగుతుందని మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలని తెలిపారు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ప్రభుత్వం సరఫరా చేయడం జరిగిందని లబ్ధిదారులు ఒకేసారి మూడు నెలలకు సంబంధించిన తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. అక్రమ ఇసుక తరలిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని ఇందిరమ్మ ఎల్ల నిర్మాణానికి ఇసుక అవసరం ఉన్నవారు యాప్ ద్వారా బుక్ చేసుకోవాలని మెదక్ నర్సాపూర్ లో ఇసుక బజారు ఏర్పాటు చేసి అందివ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రజనీకుమారి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ గౌస్ ఉద్దీన్, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు,

## విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలి...

**-తహసిల్దార్ మాలతి...**

**చిన్న శంకరం పేట ఏప్రిల్ 8 ( మన వార్త ప్రతినిధి)** విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని తహసిల్దార్ మాలతి సూచించారు, బుధవారం చిన్న శంకరంపేట మండలం మండలం జంగారాయి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు, అనంతరం రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు, ఆమె రికార్డులను పరిశీలించారు, జంగారాయి ఎర్రగుంట గిరిజన తండాలో ప్రాథమిక పాఠశాలను అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని రికార్డులను పరిశీలించారు ఈ సందర్భంగా తాసిల్దార్ మాలతి మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు, వంటగదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు రేషన్ దుకాణాలలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా బియ్యాన్ని పంపిణీ చేయాలని రేషన్ డీలర్లకు సూచించారు, మూడు నెలల బియ్యం ఒకేసారి అందించడం జరుగుతుందన్నారు, ప్రభుత్వం సన్న బియ్యాన్ని లబ్ధిదారులకు మూడు నెలలకు సంబంధించిన బియ్యాన్ని అందించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.



## అన్నీ సిసి రోడ్లుగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం : డా.కోట రాంబాబు...



**మధిర, ఏప్రిల్ 8( మన వార్త)**గ్రామాల్లో మట్టి రోడ్లుగా ఉన్న అంతర్గత రహదారులను సిసి రోడ్లుగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులను కేటాయిస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు డా. కోట రాంబాబు అన్నారు.మండలంలోని నిదానపురం గ్రామంలో గురువారం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి నిధులతో నిర్మించనున్న సిసి రోడ్డుకు వారు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండలంలోని అన్ని గ్రామాలకు ఎంపీ కోటా నుండి సిసి రోడ్ల కు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు.అదేవిధంగా మధిర నియోజకవర్గంను అభివృద్ధి పథంలో ఉరుకులు పెట్టిస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కు నియోజకవర్గ ప్రజలు రుణపడి ఉంటారన్నారు.ఈ కార్యక్రమంలో టెలికం అడ్వైజరీ కమిటీ మెంబర్ అమరవాది సత్యనారాయణ రెడ్డి, గ్రామ సర్పంచ్ రత్నకుమారి,కటికల సీతారామి రెడ్డి,బొగ్గుల వీరారెడ్డి, చావలి రామరాజు,ఐలూరి జనార్ధన రెడ్డి,కపిలవాయి సత్యనారాయణ రాజు, వెంపాటి ప్రభాకర్,రమేష్, ఇర్మియా,అక్కినపల్లి నాగేశ్వరరావు,సోమ రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ సరఫరాకు చర్యలు చేపట్టాలి...

**-సంబంధిత అధికారులతో పి.ఎన్.జి అమలు పై జిల్లా కలెక్టర్ సమీక్ష...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 08** భువనగిరి , బీబీనగర్ , చౌటుప్పల్ , వలిగొండ మండలాలకు మెగా పి.ఎన్. జి పైపు లైన్ ద్వారా గృహ వినియోగదారులకు గ్యాస్ సరఫరా అదించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. బుధవారం రోజు మినీ మీటింగ్ హల్ లో మండాలలో పి.ఎన్.జి పైపు లైన్ ద్వారా గ్యాస్ ఏర్పాటు కు సంబదించిన సమావేశం లో జిల్లారెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి , అడిషనల్ ఎస్పీ లక్ష్మినారాయణ సంబంధిత శాఖల అధికారులతో పిఎన్జి అమలు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో నాలుగు మండలాలకు మెగా గ్యాస్ పైప్ లైన్ ద్వారా గృహ వినియోగదారులకు సురక్షితంగా , నిరంతరంగా పిఎన్జి సరఫరా అందించేందుకు చేపడుతున్న పైపులైన్ పనుల పురోగతి పై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెగా పిఎన్జి పైపులైన్ ఏర్పాటు పనులు ఎలాంటి అంత రాయం లేకుండా సజావుగా కొనసాగాలని సూచించారు. పనులు వేగవంతంగా పూర్తి కావడానికి సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా రెవెన్యూ , మున్సిపల్ , గ్రామ పంచాయతీ శాఖలు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని తెలిపారు. మెగా గ్యాస్ పైపులైన్ పనుల సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసు కోవాలని సూచించారు. మెగా గ్యాస్ మెయిన్ పైప్ లైన్ ద్వారా వచ్చే గ్రామాలకు రోడ్ల తవ్వకాలు , డ్రైనేజీ , మర మ్మత్తుల సమస్యలు తలెత్త కుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ పనులు చేపట్టాలని అన్నారు.పనులు పూర్తి అయ్యేలా ప్రతి శాఖ తమ బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలని తెలిపారు. పైపు లైన్ ద్వారా ప్రజలకు సురక్షిత గ్యాస్ సరఫరా అందించడంలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో భువనగిరి , చౌటుప్పల్ రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి , శేఖర్ రెడ్డి , మెగా సిటీ గ్యాస్ రిప్రజెంటేటివ్ రమేష్ , వంశీ , జిల్లా పౌర సరఫరాల అధికారి రోజారాణి , జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి తహశీల్దార్లు పాల్గొన్నారు.



## స్టెల్లామేరీ స్కూల్లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుక



**బూర్గంపాడు / మనవార్త** మొరంపల్లిబంజర స్టెల్లా మెరిస్కూల్లో గ్రాడ్యుయేషన్ డే వేడుక ప్రిన్సిపల్ సుమలత ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ లక్ష్మీపురం మరియు ఫాదర్ క్రీస్తు బాబు (ఓ సి డి.) స్టెల్లా మేరీ స్కూల్ యాజమాన్యం ఆహ్వానం మేరకు విచ్చేసి యూకేజీ విద్యార్థిని,విద్యార్థులు కనబరిచిన ప్రతిభను వీక్షించారు. అతి చిన్న వయసులో విద్యార్థులు ఆంగ్లంలో అనర్గలికంగా మాట్లాడటం చాలా సంతోషంగా ఉందని ఉపాధ్యాయులను, ప్రిన్సిపల్ సుమలతను కొనియాడారు. అనంతరం స్కూల్ యాజమాన్యం పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డిని ఘనంగా శాలువాతో సత్కరించి, ఈనెల 10వ తేదీన తన జన్మదిన వేడుక ఉండటంతో ముందస్తుగా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్టెల్లా మేరీ స్కూల్ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు పోతిరెడ్డి తెలిపారు. ఫాదర్ క్రీస్తుబాబు మొరంపల్లి బంజర పరిసర ప్రాంత ప్రజలకు అతి తక్కువ ఫీజుకె కార్పొరేట్ స్థాయిలోవిద్య బోధన చేస్తున్న స్టెల్లా మెరీస్ స్కూల్లో అడ్మిషన్ తీసుకొని మీ పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది, మీడియా మిత్రులు శనగ మల్లేష్, బర్ల ప్రభాకర్ విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అంగన్వాడీలలో ఆకస్మిక తనిఖీలు...



**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 08** మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శృతి హోజ యాదాద్రి భువనగిరి జిల్లాలో బీబీ నగర్ అంగన్వాడి చెందిన అంగన్వాడీ కేంద్రాలు 5 , 6 మరియు రామునిగుండ్ల తండాను బుధవారం రోజు సందర్శించారు. డైరెక్టర్ అంగన్వాడి కేంద్రాల్లో ఉన్న పోషకాహార నిల్వలను పరిశీలించారు. పిల్లలు హాజరు శాతాన్ని పెంచాలని గర్భిణీ స్త్రీలు , బాలింతలు ఆరోగ్య లక్ష్మీ భోజనాన్నీ వినియోగించుకుంటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రీ స్కూల్ విద్యా కార్యక్రమాలు ఎలా నిర్వహిస్తున్నారని , టీచర్లతో ఇంటరాక్ట్ అయ్యారు. పిల్లలతో ముచ్చటించారు. రామునిగుండ్ల తశీడా యొక్క సర్పంచ్ తో సంభాషించారు. నిర్మాణంలో ఉన్న చిల్డ్రన్స్ హోమ్ , సఖి ఓఎస్సి సెంటర్ భవనాలను పరిశీలించారు . ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి నరసింహా రావు , సిడిపిఓ శైలజ , సూపర్వైజర్లు టీచర్లు పాల్గొన్నారు.

## భూ భారతి ఆన్లైన్ తదితర అంశాలపై సమీక్ష...

**-సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 08** జిల్లాలో భూ భారతి , ప్రభుత్వ భూములు , సాధా బై నామాలు , ఎస్ ఐ ఆర్ , మీ సేవ సేవలు , ధాన్యం కొనుగోలు , ఆన్లైన్ ద్వారా ఇసుక సరఫరా తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి , రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి లతో కలసి సంబంధిత అధికారులతో సమీక్షించారు.బుధవారం రోజు మినీ మీటింగ్ హాల్ లో జరిగిన సమావేశం లో కలెక్టర్ మాట్లడుతూ భూ భారతి ద్వారా భూముల రికార్డులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అన్నారు. రైతులకు పారదర్శక సేవలు అందించాలని తెలిపారు. భూ సమస్యలు , వివాదాలు తక్షణమే పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని అన్నారు.సాధా బైనామాల సమస్య లను చట్టపరంగా పరిశీలించి , అర్హులైన వారికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమం కింద ఓటరు జాబితాలను ఖచ్చితంగా సవరించాలని , బూత్ స్థాయి అధికారుల పనితీరును పర్యవేక్షించాలని తెలిపారు. మీ సేవ కేంద్రాల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను వేగవంతం చేయాలని , దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు.జిల్లాలో పూర్తిగా ఆన్లైన్ ద్వారా ఇసుక రవాణా జరిగేలా మన ఇసుక వాహనం ఆన్లైన్ బుకింగ్ విధానాన్ని అమలు చేయాలని తహసీల్దార్ లకు సూచించారు. దీనివల్ల ఇసుక అక్రమ రవాణాకు ఆస్కారం ఉండదని అన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు సాఫీగా జరిగేలా చర్యలు తీసు కోవాలన్నారు. జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జయమ్మ , రెవిన్యూ డివిజనల్ అధికారులు కృష్ణారెడ్డి , శేఖర్ రెడ్డి , మండల తహసీల్దార్ లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## డంప్ యార్డ్ సమస్యపై కలెక్టర్ తో చర్చ..



**జమ్మికుంట, ఏప్రిల్ 08( మన వార్త ప్రతినిధి):**హుజూరాబాద్ పట్టణ శివారులోనీ సిర్సపల్లి ప్రాంతంలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ పై,జీవన ప్రమాణాలకు దూరంగా ఉండాలని,దాన్ని తరలించే విషయంపై జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా కలెక్టరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం డంపింగ్ యార్డు వల్ల కలిగే నష్టాలను,పంటలకు తలెత్తే ఇబ్బందులను,రైతులకు కలిగే నష్టాలను,జనావాసాలకు దూరంగా ఉండాలని తెలిపారు.దీనిపై ఇప్పటికే మంత్రులను,మున్సిపల్ శాఖ అధికారులను కలిసి పూర్తి వివరాలు అందజేశామని,దీనిపై మరోసారి అధికారులతో చర్చించాలని కోరారు.సానుకూలంగా స్పందించిన వారు పూర్తి నివేదిక తీసుకుంటానని తెలిపారు.

## శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కు బీసీ సంఘాల సంఘీభావం



**కరీంనగర్,ఏప్రిల్ 08( మన వార్త ప్రతినిధి):** శాతవాహన వైస్ ఛాన్సలర్ పై బురద చల్లడం మానుకోవాలని బీసీ సంఘాల నేతలు హెచ్చరించారు.బుధవారం శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ పై చేస్తున్న దుష్ప్రచారం మానుకోవాలని అన్ని బిసి సంఘల నేతలు శాతవాహన యూనివర్సిటీ గేటు ముందు సంఘీభావం తెలిపారు,యూనివర్సిటీ పనితీరు కు మెరుగైన చర్యలు చేపడుతున్న విసి ని కొంతమంది కావాలని అడ్డు తగులుతున్నరని విమర్శించారు. ప్రభుత్వ జీతా భత్యం పొందుతూ పనిచేయకుండా కొంతమంది రాజకీయాలు చేస్తూ యూనివర్సిటీ పరువు తీస్తున్నారని విమర్శించారు.బిసి వర్గాలు వున్నత పదవుల లో వుంటే తట్టుకోలేక అక్కసు వెళ్లగక్కు తూన్నా రని ఆరోపించారు.విద్యార్థుల ప్రగతి కోసం పనిచేస్తున్న విసీని పనిగట్టుకొని వెనక్కే లాగే కుట్రలు మానుకోవాలని హెచ్చరించారు. బిసి వర్గాల మీద అనవసర ఆరోపణలు, బురద చల్లడం మానుకోవాలని సూచించారు.బిసి ఉద్యోగుల కు మంచి పేరు వస్తే తట్టుకోలేక ఒక వర్గం పేరు చెప్పుకొని కొంత మంది బిసి ల మనో స్థైర్యం దెబ్బ తీయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేశిపెద్ది శ్రీధర్ రాజు, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఆది మల్లేశం, బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు నాగుల కనకయ్య గౌడ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి బొల్లం లింగమూర్తి , బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ , వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, బీసీ యువజన సంఘం అధ్యక్షులు నర్సింగౌజు శ్రీనివాస్,మాదాసు సంజీవ్ , పట్టణ అధ్యక్షులు హనుమాన్ల నితిన్ , బీసీ కొత్తపల్లి మండల ప్రధాన కార్యదర్శి కుంట చంద్రయ్య , గరిగ కోటేశ్వర్ , లింగంపల్లి శ్రీనివాస్, వంగల రవి గోపాల్ , పొన్నాల తిరుపతి , కల్వ మధుబాబు , కే సతీష్ తోపాటు అన్ని బీసీ సంఘాల అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు..

## చెరుకూరులో ధాన్యం తనిఖీ కేంద్రం ప్రారంభం



**వాజేడు ఏప్రిల్ 8 మనవార్త** యాసంగి( రబీ )2025 -26 సీజన్ ప్రారంభమైన సందర్భంగా ఇతర రాష్ట్రాల (ఛత్తీస్ గఢ్ రాష్ట్రం బీజాపూర్,సుకుమ )నుండి ములుగు జిల్లాకు వస్తే వరి ధాన్యం తనిఖీ చేయుటకు గాను అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్పోస్ట్ ను ములుగు జిల్లా వాజేడు మండలం చెరుకూరు గ్రామంలో ఏర్పాటు చేసారు.అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్.మహేందర్ జి.ధాన్యం తనిఖీ కేంద్రంను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా పౌరసరఫరాల అధికారి సయ్యద్ షా ఫైసల్ హుస్సైన్,జిల్లా మేనేజర్,పౌరసరఫరాల కార్పోరేషన్ ఎస్ కృష్ణవేణి, వాజేడు తహసీల్దార్ శ్రీనివాస్, రెవెన్యూ,వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## కొండగట్టు ఆంజనేయ స్వామి ని దర్శించుకున్న మాజీ స్పీకర్ మధు సుదనా చారీ



**కొండగట్టు, ఏప్రిల్ 8(మనవార్త ప్రతినిధి )**మాజీ స్పీకర్ సుద్దాల మధు సుధాన చారీహా కొండగట్టు ఆంజనేయ స్వామి ని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవస్థాన అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆంజనేయ స్వామివారిని దర్శించుకుని రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, అభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు. ఆలయ ప్రాంగణంలో కొంతసేపు గడిపి,అక్కడి ఏర్పాట్లు మరియు భక్తులకు అందిస్తున్న సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల ఆలయానికి పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మరిన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొండగట్టు ఆంజనేయ స్వామివారి క్షేత్రం ఎంతో పవిత్రమైనదని, ప్రతి భక్తుడు జీవితంలో కనీసం ఒకసారి అయినా దర్శించుకోవాలని సూచించారు.

## ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిసహకారంతో ఎన్నోసంవత్సరాల కళకు సహకారం

**మనవార్త ప్రతినిది** తలకొండపల్లి మండలం చీపునుంతల గ్రామంలో గతకాలంగా విద్యుత్ సమస్యతో ప్రజలు అనేక ఇబ్బందులుపడుతున్నారు.ఈ సమస్యను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి దృష్టికి తీసుకోవడంతో విద్యుత్ ఏ. ఈ.ఏ.డి.తో మాట్లాడి 100కేవీ ట్రాన్స్ ఫార్మర్ గ్రామానికి మంజూరి చేసి చీపునుంతల గ్రామానికి 24 గంటల విద్యుత్ సమస్యకు పరిష్కరం జరిగిందని గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరం నుండి కరెంటు కష్టాలు పడుతున్న తమ గ్రామానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఈ రోజు కొత్త ట్రాన్స్ఫార్మర్ అమర్చి విద్యుత్ బల్బులు వెలిగించారు. చీపునుంతల గ్రామం తరపున గౌరవ ఎమ్మెల్యే నారాయణ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ, అధ్యక్షులు మలే రామచంద్రారెడ్డి,మాజీ మండల అధ్యక్షులు గుజ్జుల మహేష్, లైన్మాన్ వెంకటయ్య, వశ్య, నాయకులు వెంకరాజు రెడ్డి, మాజీ సర్పంచ్ బండి రఘుపతి, వార్డు సభ్యులు శారదా అంజమ్మ, రాజు, మల్లేష్,శేఖర్,చెన్నకేశవులు రాములు, మల్లయ్య, సాయినాద్,పెంటయ్య,జంగయ్య, శ్రీశైలం,చెన్నయ్య బోళ్ల శివ , కృష్ణా తదితరులు పాల్గొన్నారు

## కమలాపూర్ మండల బిజెవైయం అధ్యక్షుడిగా రావుల ఆకాష్ ఏకగ్రీవ ఎన్నిక



**కమలాపూర్ ఏప్రిల్ 08 మన వార్త ప్రతినిధి** హన్మకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన బిజెవైయం మండల కమిటీ లో మర్రిపల్లిగూడెం గ్రామానికి చెందిన రావుల ఆకాష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆకాష్ మాట్లాడుతూ నా మీద ఉన్న నమ్మకంతో నాకు ఈ పదవి ఇచ్చిన జిల్లా నాయకులకు మరియు మండల నాయకులకు నాకు సహకరించిన నా తోటి కార్యకర్తలకు నా గ్రామ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటు నేను నమ్ముకున్న నా పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తానని నేను పొందిన నా పదవికి తగిన న్యాయం చేస్తానని రావుల ఆకాష్ ఈ ప్రకటనలో తెలపడం జరిగింది

## సీఎంఆర్ఎఫ్ పేదలకు ఒక వరం మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకటరెడ్డి




**కల్వకుర్తి ఫిబ్రవరి 6 మన వార్తా ప్రతినిధి.** తలకొండపల్లి మండల కేంద్రంలోని సిఎంఆర్ఎఫ్ చెక్కు రావడానికి కృషి చేసిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు పూర్తి వివరాలకు వెళ్తేతలకొండ పల్లి మండలంకాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉండి, ప్రతి పేదవాడికి వైద్యం అందించడానికి తోడుగా ఉంటుందనీ వేల్జాల్ గ్రామానికి చెందిన తిరుమణి శ్రీనివాస్ గౌడ్ కి 60000 వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కును మాజీ ఎంపిటిసి జి.శ్రీనివాసమూర్తి , మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి వారి చేతుల మీదుగా అందజేశారు,ఈ సహాయ సహకారానికి అండగా నిలిచిన కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి కి,వెల్జాల్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు లబ్ధిదారుడి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీ జి శ్రీనివాసమూర్తి,మాజీ ఉప్ప సర్పంచ్ లు బి నర్సింలు, అజీజ్, నాయకులు వద్దే రాజు, ఎల్ మల్లేష్, పులిజాల విష్ణు, కటికల చెన్నయ్య, ఆఫ్తాబ్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## జిల్లాలోప్రీ-కన్సెప్షన్ ప్రీ-నేటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ చట్టం-1994...


**-జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం...**

**-హాజరైన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మనోహర్...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 08** యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రీ-కన్సెప్షన్ , ప్రీ-నేటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ చట్టం- 1994 కు సంబంధించి జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం నిర్వహించ బడింది. సమావేశానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం. మనోహర్ అధ్యక్షతన మధ్యాహ్నం ఓంటి గంటకు జిల్లా కలెక్టరేట్ మినీ హాల్ లో నిర్వహించడం జరిగింది. సమావేశంలో జిల్లాలో చట్టపరమైన నిబంధనల అమలు , ఆరోగ్య సంస్థల పనితీరు , రికార్డుల నిర్వహణ , సేవల నాణ్యత అంశాలపై విస్తృతంగా చర్చించి సమీక్షించారు. అదే విధంగా జిల్లాలోని అల్ట్రాసౌండ్ కేంద్రాలు , జన్యు పరీక్ష కేంద్రాల నమోదు , పునరుద్ధరణ , వార్షిక తనిఖీ నివేదికలు , చట్ట ఉల్లంఘనల పై తీసుకున్న చర్యలు , పెండింగ్ అంశాలపై సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు అన్ని నమోదిత కేంద్రాలు చట్ట నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ముఖ్యంగా పిసి & పిఎన్డిటి చట్టం కింద లింగ నిర్ధారణ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని , ఎటువంటి ఉల్లంఘనలు జరగకుండా క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పిసి & పిఎన్డిటి ప్రోగ్రాం అధికారి డా. యల్. యశోద , డా. వై. ఇందిరా మణి , ప్రొఫెసర్ & హెచ్ ఓ డి గైనకాలజీ , ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ భువనగిరి , డా. యస్. జ్యోతి , గైనకాలజిస్టు డా. శ్రీదేవి , డా. నిర్మల , పిల్లల వైద్య నిపుణులు డా. సుమన్ కళ్యాణ్ , డిప్యూటీ డీఎంహెచ్ఓ భువనగిరి డివిజన్ అరుంధతి , జిల్లా పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ డా. ప్రమీల సఖి ఎన్ జీ ఓలు శివ లింగం , యాత్ర నాగరాజు , స్కీడ్ సిహెచ్. సాయి రెడ్డి , (I/1/ సి బై డిఈఎంఓ తదితరులు పాల్గొన్నారు.




# పైపైనే పారిశుధ్యం..



**జమ్మికుంట, ఏప్రిల్ 08( మన వార్త ప్రతినిధి):**పైపైనే పారిశుధ్యం పనులు చేస్తున్నారని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.హుజూరాబాద్ వెళ్లే ప్రధాన రహదారిలో పాత పెట్రోల్ పంపు ప్రక్కన ఉన్న మురికి కాలువ చెత్తా,ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిల్లతో నిండిపోయింది. దుర్గంధం వస్తుందని ప్రజలు,వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రధాన రహదారి ప్రక్కన మురికి కాలువే ఎలా వుంటే ఇక గల్లిలలోని మురికి కాలువల పరిస్థితి ఎలావుంటుందో అని అసహనం వ్యక్తం చేస్తున్నారు.మురికి కాలువలో పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తొలగించడంలేదని పైపైనే పారిశుధ్యం పనులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మురికి కాలువలలో పేరుకుపోయిన చెత్తను పూర్తి స్థాయిలో అడుగు వరకు తొలగించాలని కోరుతున్నారు.

## తెలంగాణ జాగృతి స్టేట్ సోషల్ మీడియా సభ్యుడి కుటుంబాన్ని పరామర్శించిన కవిత

**- ఏప్రిల్ 25న నూతన రాజకీయ దిశగా అడుగులు...**

**గజ్వేల్, ఏప్రిల్ 08 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో బుధవారం రోజు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత పర్యటించారు. ముందుగా తన చిన్ననాటి స్నేహితురాలి కుమారుడి వివాహానికి హాజరై అనంతరం తెలంగాణ జాగృతి స్టేట్ సోషల్ మీడియా సభ్యులు సుదర్శన్ గౌడ్ సతీమణి నందిని ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా, వారిని పరామర్శించేందుకు కవిత నేరుగా వారి నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా నందిని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న కవిత, వారికి ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కవిత, రాష్ట్ర రాజకీయాల్లో చోటుచేసుకోబోతున్న పరిణామాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో, ప్రజల ఆకాంక్షల మేరకు ఒక కొత్త రాజకీయ శక్తిగా అవతరించబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. కేవలం అధికారం కోసమే కాకుండా, సామాజిక తెలంగాణ లక్ష్యంగా తమ ప్రయాణం ఉంటుందని స్పష్టం చేశారు. సమాజంలోని అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా తమ పార్టీ కార్యాచరణ ఉంటుందని తెలిపారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడటానికి, రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేయడమే తమ ప్రధాన ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు. ఏప్రిల్ 25న జరగబోయే ఈ కీలక ప్రకటన తెలంగాణ రాజకీయాల్లో ఒక కొత్త మలుపు కానుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక జాగృతి నాయకులు, సుదర్శన్ గౌడ్ కుటుంబ సభ్యులు, గైనిబైటి నాగరాజు గౌడ్, బండ మహేందర్ గౌడ్, ప్యాటా అశోక్, కనకసేన, గజ్వేల్ జాగృతి సభ్యులు పాల్గొన్నారు.




## మినీ వాటర్ ట్యాంక్ ల వద్ద శుభ్రత లేక కాలనీ వాసులకు ఇబ్బందులు




**సిరికొండ, ఏప్రిల్ 08 (మన వార్త)**సిరికొండ మండల కేంద్రంలోని 3వార్డు, 4వ వార్డులో కాలనీ వాసులకు మంచి నీరు సౌకర్యం కొరకు గతంలో త్రాగు నీటి మినీ ట్యాంకులను గత పాలకవర్గం నిర్మించినారు ప్రస్తుతం ఆ రెండు మినీ వాటర్ ట్యాంకుల వద్ద శుభ్రత లేకపోవటంతో కాలనీ వాసులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు ఆ మినీ ట్యాంకులవద్ద నాచు చెత్త పేరుకుపోవడంతో ఆ మంచి నీరు అసౌకర్యంగా ఉందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ప్రస్తుతం ఉన్న గ్రామ పంచాయతీ పాలకవర్గం,సిబ్బంది తక్షణమే పట్టించుకుని మినీ వాటర్ ట్యాంకుల వద్ద పేరుకుపోయిన నాచు చెత్త చెదారాన్ని శుభ్రపరిచి మంచి త్రాగు నీరు సౌకర్యంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు ప్రస్తుతం వేసవి కాలం కావడంతో 4వ వార్డు లోని మినీ వాటర్ ట్యాంక్ వద్దనే కామారెడ్డి కి వెళ్ళే మినీ బస్ స్టాప్ ఉండడంతో నిత్యం వందలాది మంది ప్రయాణికులకు ఆ మినీ ట్యాంక్ లోని నీటిని త్రాగే అవకాశం ఉన్నందున తక్షణమే మినీ వాటర్ ట్యాంక్ ను శుభ్రం చేసి ప్రయాణికులకు అటు కాలనీ వాసులకు ఇబ్బంది కలగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## జీఎస్టీ ఇన్స్పెక్టర్ ఉద్యోగానికి ఎంపికైన గద్దపాక యువకుడు



**శంకరపట్నం:ఏప్రిల్08(మనవార్త ప్రతినిధి)**శంకరపట్నం మండలం గద్దపాక గ్రామానికి చెందిన భూమ అరవింద్ జీఎస్టీ ఇన్స్పెక్టర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. శంకరపట్నం మండలం గద్దపాక మాజీ ఎంపీటీసీ భూమ సంపత్ కుమారుడైన భూమ అరవింద్ పదో తరగతి వరకు వీణవంకలో చదువుకున్నాడు. ఇంటర్ అల్గునూర్ లోని ఎస్సార్ కాలేజీలో చదువుకున్న భూమ అరవింద్ వరంగల్ కిట్స్ కాలేజీలో మెకానికల్ ఇంజనీర్ పూర్తి చేశాడు. అమెరికాలో ఎమ్ ఎస్ చదువుకున్న భూమా అరవింద్ ప్రభుత్వ ఉద్యోగానికి ప్రయత్నించాడు. జనవరి18-19 వ తేదీల్లో స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించిన పరీక్షల్లో జీఎస్టీ ఇన్స్పెక్టర్ ఉద్యోగానికి జరిగిన పరీక్ష ఫలితాలు బుధవారం విడుదల అయ్యాయి. దేశవ్యాప్తంగా 1024 వ ర్యాంకు వచ్చింది. ఈ మేరకు భూమ అరవింద్ జీఎస్టీ ఇన్స్పెక్టర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఆయన ఎంపికపట్ల శంకరపట్నం మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు అభినందించారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యత...

**-మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు...**

**-వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి**



**పెబ్బేరు.ఏప్రిల్08 (మన వార్త ప్రతినిధి)**రైతుల సంక్షేమమే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యత అని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. బుధవారం పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ...రైతుల సంక్షేమమే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యత అని తెలిపారు. పెబ్బేరు చుట్టూ పక్కల పరిధిలో మొక్కజొన్న రైతుల సౌకర్యార్థం ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ను సంప్రదించి పెబ్బేరులో మొదటిసారి మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం మొక్కజొన్న రైతులకు రూ. 2400 మంచి మద్దతు ధర కల్పిస్తోందని, రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం,పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్,వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ప్రమోదిని రెడ్డి, వైస్ చైర్మన్ ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి, తహసిల్దార్ సత్యనారాయణ రెడ్డి ఇతర ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పీర్జాదిగూడలో 'మోను చికెన్ మార్కెట్' ప్రారంభం...

**-ముఖ్య అతిథిగా పాల్గొన్న తుంగతుర్తి రవి...**



**తెలంగాణస్టేట్ బ్యూరో, భాస్కర్ చారి, ఏప్రిల్ 8, మనవార్త.**పీర్జాదిగూడ పరిధిలోని ఎమ్మార్వో కార్యాలయం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన మోను చికెన్ మార్కెట్ ను ఘనంగా ప్రారంభించారు. దుకాణ యజమాని తిరుపతి యాదవ్ ఆహ్వానం మేరకు, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆర్.వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి పాల్గొన్నారు. ఎఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ.. స్థానికులకు అందుబాటులో నాణ్యమైన మాంసం మరియు గుడ్లను అందించేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. వ్యాపారపరంగా తిరుపతి యాదవ్ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఎఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సోమయ్య, తిరుపతి యాదవ్ కుటుంబ సభ్యులు, మిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కిడ్స్ పార్క్ స్కూల్ ప్రిన్సిపల్ జాకీర్ హుస్సేన్ ప్రతి విద్యార్థుల హృదయాల్లో బ్రతికే ఉన్నాడు



**నిజామాబాద్ జిల్లా ఆర్ సి రిపోర్టర్ పి. సుధాకర్ (మన వార్త) ఏప్రిల్ 8** కిడ్స్ పార్క్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీ జాకీర్ హుస్సేన్ గారి ఆకస్మిక మరణ వార్త మా అందరికీ తీవ్ర దిగ్భ్రాంతి, విషాదాన్ని కలిగించింది. ఆయన కేవలం ఒక ప్రిన్సిపాల్ మాత్రమే కాకుండా, ఒక గొప్ప గురువుగా, మార్గదర్శకుడిగా, విద్యార్థుల భవిష్యత్తును నిర్మించడంలో జీవితాంతం అంకితభావంతో పనిచేసిన మహనీయుడు. ఆయన తన పదవిని బాధ్యతగా భావించి, క్రమశిక్షణ, నైతిక విలువలు, విద్యా ప్రమాణాలు పెంపొందించడంలో ఎల్లప్పుడూ ముందుండేవారు. విద్యార్థుల పట్ల అపారమైన ప్రేమతో, ప్రతి ఒక్కరి ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహిస్తూ, మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో ఆయన చేసిన కృషి అపారమైనది. ఉపాధ్యాయులతో సమన్వయం కలిగి, పాఠశాల అభివృద్ధి కోసం ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపట్టి, కిడ్స్ పార్క్ స్కూల్ను మంచి స్థాయికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన నడవడి, వినయం, సహనం, నాయకత్వ లక్షణాలు అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచాయి. ఎలాంటి సమస్య వచ్చినా శాంతంగా పరిష్కరించే ఆయన తీరు, అందరిని కలుపుకుని ముందుకు తీసుకెళ్లే ఆయన దృక్పథం, ఆయనను ప్రత్యేక వ్యక్తిగా నిలబెట్టాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అందరి హృదయాల్లో ఆయనకు ప్రత్యేక స్థానం ఉంది. ఆయన సేవలు, ఆయన చూపిన మార్గం, ఆయన బోధించిన విలువలు ఎప్పటికీ మాకు మార్గదర్శకంగా నిలుస్తాయి. శ్రీ జాకీర్ హుస్సేన్ గారి మరణం కిడ్స్ పార్క్ స్కూల్ కుటుంబానికి తీరని లోటు. ఆయన లేని ఖాళీని ఎవరూ భర్తీ చేయలేరు. ఈ దుఃఖ సమయంలో వారి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా గాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని మనస్పూర్తిగా ప్రార్థిస్తున్నాము. ఆయన ఆత్మ శాంతి పొందాలి. అని ప్రతి ఒక్క విద్యార్థి తల్లిదండ్రులు విద్యార్థులు ప్రతి ఒక్కరూ మనస్పూర్తిగా కోరుకుంటున్నారు.

## అక్రమ ఇసుకను వేలం వేసిన రెవెన్యూ అధికారులు...



**రామాయంపేట ఏప్రిల్ 8( మన వార్త ప్రతినిధి )**అక్రమ ఇసుక డంపులు ఉన్న ఇసుక రవాణా చేసిన సమాచారం ఇస్తే సమాచారం ఇచ్చిన వారి పేర్లు గొప్యాంగా ఉంచడం జరుగుతుందని అక్రమ ఇసుక డంపులు ఏర్పాటు చేస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని రామాయంపేట తహసిల్దార్ రజని కుమారి హెచ్చరించారు. రామాయంపేట మండలంలోని అక్రమంగా ఇసుక డంపులను సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు ఇసుకను తహసిల్దార్ కార్యాలయం కు తరలించారు అట్టి ఇసుకకు నేడు వేలం కార్యక్రమాన్ని తహశీల్దార్ రజనీకుమారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు, వేలంలో మండలాలలోని ఎనిమిది మంది పాల్గొనగా ఒక్క లక్ష 6,500 రూపాయలకు మద్దూరి సునీల్ అనే వ్యక్తి వేలం పాటలో కైవసం చేసుకున్నారు, ఈ సందర్భంగా తహసిల్దార్ రజనీకుమారి మాట్లాడుతూ వేలం పాటలో కొనుగోలు చేసిన ఇసుకను ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వ పనులకే వినియోగించుకోవాలని మండలంలో ఎక్కడ కూడా అక్రమంగా ఇసుక తరలించిన డంపుగా ఏర్పాటు చేసుకున్న వారిపై శాఖపరమైన చర్యలు తప్పవని ఆమె అన్నారు, గ్రామాల్లో ఎవరైనా ఇసుక అక్రమ డంపులు చేసిన రవాణా చేసిన రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి పేర్లను గోపెయంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రజనీకుమారి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ గౌస్ ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ హిందూ సమ్మేళనం...

**గంభీరావుపేట/మన వార్త /ప్రతినిధిఏప్రిల్ 8** గంభీరావుపేట మండల కేంద్రంలోని హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని గంభీరావుపేట నాగంపేట గ్రామంలోని భక్త మార్కండేయ దేవాలయంలో హనుమాన్ హిందూ సమ్మేళనం కార్యక్రమం అధ్యక్షులు లిరాచర్ల రవిచంద్ర శర్మలి ఆధ్వర్యంలో ఆహ్వాన కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 14న ఉదయం 10 గంటలకు గంభీరావుపేట మండలంలోని నాగంపేట గ్రామంలోని రెడ్డి సంఘం హాల్ లో నిర్వహించనున్న హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అందుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో గోరింటాల ఉపమండలం కు సంబంధించిన గ్రామాలు నాగంపేట, గోరింటాల, గజ సింగవరం, లింగాపూర్, మల్లుపల్లి, ,గ్రామాల హిందూ బంధువులు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు. ఈ సమ్మేళనంలో గోపూజ కార్యక్రమంలి సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చిన్నారులచే సాంస్కృతికలి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.హిందూ ఐక్యత కోసం ఏర్పాటుచేసిన ఇట్టి కార్యక్రమంలో హిందూ బంధువులందరూ ఇట్టి కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో విరాట్ హిందూ కమిటీ అధ్యక్షులు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి




**-జాగృతి నాయకులు కూర సురేష్...**

**గంభీరావుపేట/మన వార్తా /ప్రతినిధి ఏప్రిల్ 8** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని లక్ష్మీపూర్ తండా. నాగంపేట దమ్మన్నపేట తో పాటు పలు గ్రామాలలో రైతులు కోత కోసి ధాన్యం 15 రోజులుగా ఆరబెట్టుకుంటున్నారు. ధాన్యం ఆరబెట్టుకుంటుకొన్న కళ్ళల్లో ధాన్యాన్ని జాగృతి నాయకులు కూర సురేష్ సందర్శించి రైతులతో మాట్లాడారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలతో పాటు లక్ష్మీపూర్ తండా . నాగంపేట దమ్మన్నపేట తో పాటు అనేక గ్రామాలలో రైతులు ముందస్తు సాగు చేసుకుని వరి కోతలు కోసి దాన్యమును కొనుగోలు కేంద్రాలలోకి తీసుకువచ్చి ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నారు ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అకాల వర్షాలు కురిస్తే రైతులు తీవ్ర ఇబ్బందులు పడతారని జిల్లా మండల అధికారులు స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు ఈ పరిశీలనలో రైతులు. పాల్గొన్నారు.

## కొత్తపల్లిలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం




**గంభీరావుపేట/మన వార్తా /ప్రతినిధి ఏప్రిల్ 8** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోనికొత్తపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ళు గృహప్రవేశానికి విచ్చేసిన గ్రామ సర్పంచ్ నాగపురి బాలరాజు గౌడ్ చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేయడం జరిగింది పాల్గొన్నవారు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎండి హమీద్ గ్రామ శాఖ అధ్యక్షులు మేడ భాస్కర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండి ఆజాం ఇందిరమ్మ కమిటీ మెంబర్లుసీనియర్ నాయకులు పెద్దూరి గణేష్ ఎలక రాజు మాడుగుల మల్లేశం ఎండి ఏదుల్ ఎలుక మహేష్ వేషాల వెంకటి శంకర్ తదితరులు పాల్గొన్నారు

## అంగన్వాడీలో నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి...

**-యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 08** అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు , గర్భిణీలు , బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు.



బుధవారం రోజు యాదగిరి గుట్ట మండలం వంగపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో నిర్వహణ , అందిస్తున్న సేవలను సమగ్రంగా పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో మొత్తం ఎంతమంది పిల్లలు నమోదు అయ్యారని , ప్రతి రోజు పిల్లలు ఎంత మంది అంగన్వాడీ కేంద్రానికి వస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.పిల్లలకు ప్రతిరోజు ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం రుచికరమైన , నాణ్యమైన ఆహారంఅందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ రోజు పిల్లలకు వడ్డించిన భోజనాన్ని స్వయంగా పరిశీలించి , ఆహార నాణ్యత , పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తున్నారో లేదో తనిఖీ చేశారు. ఆహారం తయారీలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. చిన్నారుల పై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. రోజు వారీగా పిల్లలకు నిర్వహించే విద్యా, వినోద కార్యక్రమాలు ఏమిటి అని అడిగి తెలుసు కున్నారు. పిల్లలతో స్వయంగా మాట్లాడి , ఏబీసీడీలు చెప్పించడంతో పాటు వారి ప్రతిభను ప్రోత్సహించారు. గర్భిణీలు , బాలింతలకు అందించే సేవలు కూడా సక్రమంగా ఉండాలని , వారికి అవసరమైన పోషకాహారం అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.అంగన్వాడీ కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు , అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన సిరికొండ ఆదర్శ పాఠశాలలో పోలీసుల ప్రత్యేక కార్యక్రమం

**సిరికొండ ఏప్రిల్ 08 (మన వార్త)**సిరికొండ మండల కేంద్రంలోని పీయం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల & కళాశాలలో విద్యార్థుల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక హెడ్ కానిస్టేబుల్ శంకర్ హాజరై విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రత ప్రాముఖ్యతపై వివరించారు.వాహనాలు నిర్లక్ష్యంగా నడపడం, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, ట్రాఫిక్



సిగ్నల్స్‌ను పాటించకపోవడం వంటి కారణాల వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.మైనర్‌లు వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలపై కూడా ఆయన అవగాహన కల్పించారు. ఇటువంటి సందర్భాల్లో తల్లిదండ్రులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.రోడ్డు ప్రమాదాలు వ్యక్తిగత నష్టమే కాకుండా కుటుంబాలకు, సమాజానికి కూడా పెద్ద నష్టం కలిగిస్తాయని పోలీసులు తెలిపారు. అందువల్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని కోరారు. అర్హత కలిగిన వారు తప్పనిసరిగా ప్రభుత్వం జారీ చేసే డ్రైవింగ్ లైసెన్స్ పొందాలని సూచించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు సురక్షితంగా ఉండాలంటే రోడ్డు భద్రతా నియమాలను చిన్న వయస్సులోనే అలవర్చుకోవడం చాలా ముఖ్యమని తెలిపారు. ట్రాఫిక్ నియమాలను గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్ మధుకర్, జీవన్, నరేష్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి...

**-సర్పంచ్ హలావత్ మోహన్ నాయక్....**

**చిన్న శంకరం పేట ఏప్రిల్ 8 ( మన వార్త ప్రతినిధి)**చిన్న శంకరంపేట మండలం కామారం తండా గ్రామపంచాయతీ



పరిధిలోని రాజ్య తండా ప్రాథమిక పాఠశాల పరిసర ప్రాంతంలోని పిచ్చి మొక్కలు మరియు చెత్తచెదారం ను సర్పంచ్ మోహన్ నాయక్ తో పాటు పాలకవర్గ సభ్యులు తొలగించారు ఈ సందర్భంగా సర్పంచ్ మోహన్ నాయక్ మాట్లాడుతూ మన చుట్టూ పరిసర ప్రాంతాలను పరిశుభ్రత ఉంచుకుంటే ఎలాంటి రోగాలు రాకుండా అరికట్టవచ్చునీ తెలియజేశారు. మన ఇంటి పరిసరాలతో పాటు గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్య గ్రామంగా చేసుకోవచ్చని గ్రామంలో చేపట్టే అభివృద్ధి పనులకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మోహన్ నాయక్ తో పాటు పంచాయతీ కార్యదర్శి స్వర్ణలత పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## కొండాపూర్ పెంటిక వాగు ఘటనకు 41 ఏండ్లు: తెలంగాణ తొలి ఎన్కౌంటర్ గా గుర్తింపు రైతు కూలీల రక్తంతో చరిత్రలో నిలిచిన రోజు

**సిరికొండ ఏప్రిల్ 08 (మన వార్త)**రాజన్న సిరిసిల్ల జిల్లా కోనారావుపేట మండలం కొండాపూర్ శివారులోని పెంటిక వాగు వద్ద 1985 ఏప్రిల్ 6న జరిగిన ఘటనకు ఈరోజుతో 41 సంవత్సరాలు పూర్తయ్యాయి. తెలంగాణలో తొలి ఎన్కౌంటర్‌గా గుర్తింపు పొందిన ఈ సంఘటన అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.ఆ రోజున సాయంకాలం మసక చీకట్లో రైతు కూలీ నాయకులు పెంటిక వాగు ఒడ్డున విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో, ఎలాంటి హెచ్చరికలు లేకుండా పోలీసులు కాల్పులు జరిపినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొందరిని ప్రాణాలతో పట్టుకుని చెట్లకు కట్టేసి కాల్చిచంపినట్లు ప్రత్యక్ష సాక్ష్యాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఘటనలో లక్ష్మీరాజ్యం, సత్తయ్య, గంగయ్య వంటి రైతు కూలీలు మృతి చెందారు.ఎన్కౌంటర్ నుంచి తప్పించుకున్న చిట్యారి నారాయణ గౌడ్ మరుసటి రోజు మీడియా ముందు ఘటన వివరాలు వెల్లడించడంతో ఇది బూటకపు ఎన్కౌంటర్ అనే ఆరోపణలు బలపడ్డాయి. ఈ సంఘటన ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని సిరికొండ అటవీ ప్రాంతం పరిసరాల్లో రైతాంగ ఉద్యమాలకు మరింత ఊపునిచ్చింది.పెంటిక వాగు ఒడ్డున ఉన్న మర్రిచెట్టు ఈ ఘటనకు నిశ్శబ్ద సాక్షిగా ఇప్పటికీ నిలిచివుంది. ఆ చెట్టు నీడలోనే కూలీలు సేదతీరినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటన తరువాత సిరిసిల్ల ప్రాంతంలో రైతాంగ పోరాటాలు మరింత ఉధృతమయ్యాయి. ప్రజల్లో చైతన్యం పెరిగి, ఉద్యమాలు విస్తరించాయి.కొండాపూర్ ఘటన తర్వాత నిర్బంధ పరిస్థితుల మధ్య కూడా రైతాంగ పోరాటాలు విస్తరించాయి. జగిత్యాల జైత్రయాత్ర, సిరిసిల్ల ఉద్యమాలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. అలాగే బీడీ, చేనేత కార్మికుల సంఘటితం, మహిళలపై అణిచివేతకు వ్యతిరేకంగా ప్రజా సంఘాలు పోరాటాలు నిర్వహించాయి.ఇప్పటికీ నాలుగు దశాబ్దాల తరువాత పెంటిక వాగు గాయం మానలేదు. ఆ ఘటనను తలుచుకుంటూ స్థానికులు ఆ రోజును స్మరించుకుంటున్నారు.

## ఈ కేవైసీ చేయించుకోకపోతే డబ్బులు రిజర్వ్ బ్యాంకుకు వెళ్తాయి...

**-రీజనల్ మినీ బ్యాంకుల ఇన్చార్జ్ శౌరి...**

**చిన్న శంకరంపేట ఏప్రిల్ 8 ( మన వార్త ప్రతినిధి )**ఈకేవైసీ చేయించుకోకపోతే ఖాతాలో ఉన్న డబ్బులు రిజర్వ్ బ్యాంకు



కు తిరిగి వెళ్తాయని రీజనల్ మినీ బ్యాంకుల ఇన్చార్జ్ శౌరి తెలిపారు, చిన్న శంకరంపేట మండలం దరిపల్లి గ్రామంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థానిక బ్రాంచ్ మేనేజర్ విజయ్ ఆనంద్ ఆధ్వర్యంలో ఈకేవైసీ క్యాంపును ఏర్పాటు చేశారు, ఖాతాదారులకు ఈకేవైసీ తప్పనిసరి చేయించుకోవాలని వారికి అవగాహన కల్పిస్తూ ఈకేవైసీ అవసరమున్న ఖాతాదారులకు గ్రామంలోనే బ్యాంక్ అధికారులు వెళ్లి ఈకేవైసీ చేయించారు, ఈ సందర్భంగా రీజనల్ మినీ బ్యాంకుల ఇన్చార్జ్ శౌరి మాట్లాడుతూ 2014లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఖాతాలు తెరిచిన ఖాతాదారులకు ఈకేవైసీ తప్పనిసరి అని ఎవరైనా ఈకేవైసీ చేయించుకోకపోతే వారి ఖాతాలో ఉన్నటువంటి డబ్బులు రిజర్వ్ బ్యాంకుకు వెళ్తాయని కాబట్టి ఖాతాదారులు వెంటనే తమ యొక్క ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో చిన్న శంకరంపేట ఎస్బిఐ బ్రాంచ్ మేనేజర్ విజయ్ ఆనంద్, రీజనల్ మినీ బ్యాంకుల ఇన్చార్జ్ శౌరి, జ్ఞానేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించిన డిఎస్పీ



**ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 08 :(మన వార్తా ప్రతినిధి)**సిరిసిల్ల పట్టణ పరిధిలోని పాత బస్టాండ్ వద్ద మార్కండేయ ఫార్మసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డిఎస్పీ నాగేంద్రచారి, ప్రారంభించారు. వేసవి కాలంలో ప్రయాణికులు, స్థానిక ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం అని డిఎస్పీ పేర్కొన్నారు.ఈ సందర్భంగా డిఎస్పీ నాగేంద్రచారి, మాట్లాడుతూ, ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమనిమరిన్ని సంస్థలు ముందుకు వచ్చి ప్రజలకు సహాయం చేయాలని సూచించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఫార్మసీ సభ్యులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతన పూర్తి చేయాలి..



**ఎల్లారెడ్డి పేట ఏప్రిల్ 08: (మన వార్త ప్రతినిధి)** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని దొమ్మాటి నరసయ్య మాట్లాడుతూ ఎల్లారెడ్డిపేట మండలంలోని అన్ని గ్రామాల ప్రజలందరికీ తెలియజేయునది ఏమనగా ఇందిరమ్మ ఇండ్లను పూర్తిచేయాలని చేయాలని పిలుపునివ్వడం జరిగింది ఇప్పుడు కొత్తగా-151, ఇండ్లు సాంక్షన్ అయ్యాయి . రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఎల్లారెడ్డిపేట మండలంలోని ప్రజలు చాలామంది ఇందిరమ్మ ఇండ్ల వైపు చూస్తున్న తరుణంలో వచ్చే మే నెలలో రెండో విడత ఇందిరమ్మ ఇల్లు మంజూరు అవుతాయని తెలపడం జరిగింది ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండాడి రామిరెడ్డి డైరెక్టర్ మేండే శ్రీనివాస్ యాదవ్ బీసీ సెల్ మండల అధ్యక్షులు అనవేనీ రవి యాదవ్ పందిళ్ళ శ్రీనివాస్ గౌడ్ పుల్లయ్య గారి తిరుపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## రంగంపేట గ్రామంలో వాటర్ ప్లాంట్ ప్రారంభం



**ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 08: (మనవార్త ప్రతినిధి )**రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం రంగంపేట గ్రామంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులు, పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్, నిధుల నుండి ఏర్పాటు చేసిన శుద్ధి నీటి ప్లాంట్ ను బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి ఇట్టి వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నాయకులు గ్రామ ప్రజలకు పరిశుభ్రమైన త్రాగునీరు అందించడం ఎంతో ముఖ్యమని, ఈ వాటర్ ప్లాంట్ ద్వారా గ్రామస్తుల ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నదని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి గ్రామ సర్పంచ్ నక్క భాగ్యలక్ష్మి పరశురాములు, బిజెపి మండల అధ్యక్షులు లకుపతి నాయక్, ఏ ఎం సి చైర్మన్ రాములు నాయక్, బూత్ అధ్యక్షులు భూక్య దర్శింగ్, స్థానిక ప్రజాప్రతినిధులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ చంద్రశేఖర్...



**చిన్న శంకరంపేట ఏప్రిల్ 8 ( మన వార్త ప్రతినిధి)** ప్రజల దహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని సర్పంచ్ కంజర్ల చంద్రశేఖర్ తెలిపారు, బుధవారం చిన్న శంకరంపేట మండల కేంద్రంలో స్థానిక బస్టాండ్ వద్ద గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు, ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్ని దానాల కన్న నీళ్ల దానం మహా గొప్పదన్నారు, ప్రజల దాహార్తిని తీర్చడం కోసమే చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు, ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భాను ప్రసాద్,, ఈవో ప్రదీప్, వార్డు సభ్యులు ఆలూరి రవి, దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు గోపాల్, యువజన సంఘాల నాయకులు స్వామి, జావిద్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు

## శ్రీ వాసవి మాత చలివేంద్రం వద్ద అంబలి పంపిణీ



**గజ్వేల్ ఏప్రిల్ 08 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఇందిరాపార్క్ చౌరస్తా వద్ద శ్రీ వాసవి మాత చలివేంద్రం నిర్వాహకుల ఆధ్వర్యంలో బుధవారం అంబలి పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొమరవెల్లి ఆలయ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, పల్లె మహేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రజల దాహార్తి తీర్చడంలో చలివేంద్రాలు ఉపయోగపడతాయని శ్రీ వాసవి మాత చలివేంద్రం నిర్వాహకులను అభినందిస్తూ, అంబలి ఆరోగ్యానికి ఎంతో మేలు అని, బుధవారం గజ్వేల్ అంగడి సందర్భంగా అంబలి పంపిణీ చేయడం అభిందనీయం అని అన్నారు,అనంతరం ఆర్యవైశ్య నాయకులు అంతునూరి శివకుమార్, మాట్లాడుతూ అందరికీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి అనుగ్రహం ఉండాలని కోరుకుంటూ మానవ సేవే మాధవ సేవ అని గత కొన్ని సంవత్సరాలుగా ప్రతి వేసవి కాలంలో దాతల సహకారంతో శ్రీ వాసవి మాత చలివేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందని అందులో భాగంగా ప్రతి బుధవారం అంబలి, మజ్జిగ, పులిహోర ఇలాంటి వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఇందుకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు, ఈ కార్యక్రమంలో తోట బిక్షపతి,రుక్మయ్య, ఉప్పల కృష్ణమూర్తి,డాక్టర్ సుధాకర్, సిరిపురం సత్యనారాయణ,కాశీనాథ్, మెట్ రాములు,కైలాస ప్రశాంత్,అమర్నాథ్,స్వామి, రామారం రమేష్,దుబకుంట లక్ష్మణ్,గంగ రమేష్, గందే సంతోష్ తదితరులు పాల్గొన్నారు

## శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవ ఆహ్వానం



**ఎల్లారెడ్డి పేట ఏప్రిల్ 08 : (మన వార్తా ప్రతినిధి )**ఎల్లారెడ్డి పేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికలను రాచర్ల బొప్పాపూర్ ఉపసర్పంచ్ కొండాపూర్ వెంకట్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులకు బుధవారం అందజేశారు, జిల్లా డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ కు గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్ కు నారాయణపురం సర్పంచ్ దోమ్మడి నరసయ్య కు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి కి డైరెక్టర్ మెండే శ్రీనివాస్ యాదవ్ కు బండారి బాల్ రెడ్డి కి రవీందర్ రెడ్డి కి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు రెండవ వార్డ్ నెంబర్ చల్ల పద్మా రెడ్డి కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపురం శ్రీనివాస్ రెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొంగరి కిష్టారెడ్డి శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవ పత్రిక ను అందజేశారు

## హుజురాబాద్‌లో విద్యుత్ కార్మికుల సమ్మె ఉధృతం– డిమాండ్లు నెరవేర్చకపోతే పోరాటం మరింత తీవ్రం




**ఏప్రిల్ 08 : (మన వార్తా ప్రతినిధి)** తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయిస్ యూనియన్ జేఏసీ పిలుపు మేరకు ఈరోజు (08-04-2026) రాష్ట్రవ్యాప్తంగా అన్ని డివిజన్ కార్యాలయాల ఎదుట సమ్మెలు ఉధృతంగా కొనసాగాయి. ఈ క్రమంలో హుజురాబాద్ డివిజన్ కార్యాలయం ముందు నిర్వహించిన సమ్మెకు భారీగా కార్మికులు తరలివచ్చి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. కార్యాలయం ముందు నినాదాలతో మార్మోగిస్తూ, తమ హక్కుల కోసం పోరాటానికి సిద్ధమని స్పష్టం చేశారు. ఈ సమ్మెలో ఆర్టిసన్ కార్మికులు, అనుమ్యాన్ కార్మికులు, ఎస్పిఎం వర్కర్లు, పిసురేటు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చేతుల్లో ప్లకార్డులు పట్టుకొని, నినాదాలు చేస్తూ, తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. “మాకు న్యాయం చేయాలి”, “ఒకే సంస్థలో ఒకే రూల్స్ ఉండాలి”, “కార్మికుల హక్కులను కాపాడాలి” వంటి నినాదాలు మారుమోగాయి. కార్మికుల ప్రధాన డిమాండ్లు:ఆర్టిసన్ కార్మికులకు ఏపీఎస్ఈబీ నిబంధనలు పూర్తిగా వర్తింపజేయాలి. అనుమ్యాన్ కార్మికులను ఆర్టిసన్‌గా గుర్తించి సమాన హక్కులు కల్పించాలి. పిసురేటు కార్మికులకు జి.ఓ. 11 ప్రకారం కనీస వేతనం అమలు చేయాలి. విధుల్లో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ, “మేము గత 15 నుండి 20 సంవత్సరాలుగా ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్నాం. అయినప్పటికీ మా సేవలకు తగిన గుర్తింపు లేదు. విద్యుత్ పనులు ప్రమాదకరమైనవి, ప్రతీ రోజూ ప్రాణాలతో ఆటలాడుతూ పనిచేస్తున్నాం. ఇప్పటికే అనేక మంది సహచరులు విద్యుత్ షాక్‌లకు గురై ప్రాణాలు కోల్పోయారు. అయినా వారి కుటుంబాలకు సరైన సహాయం అందడం లేదు” అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టిసన్ కార్మికులు పంజాల శ్రీనివాస్, ఉప్పల్ రవి, అలాగే అనుమ్యాన్ కార్మికులు వెంకటేష్, శివ, రవి, శ్రవణ్, రాజు, శ్రీను తదితరులు మాట్లాడుతూ, “ఉద్యోగ భద్రత లేకుండా, తక్కువ వేతనాలతో, ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేయాల్సి వస్తోంది. మాకు కనీస హక్కులు కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం తగదు” అని మండిపడ్డారు. కార్మికులు హెచ్చరిస్తూ, “ప్రభుత్వం వెంటనే స్పందించి మా న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే, భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం. అవసరమైతే సమ్మెను మరింత ఉధృతం చేస్తాం” అని స్పష్టం చేశారు. ఈ సమ్మెలో హుజురాబాద్ డివిజన్ పరిధిలోని అన్ని సెక్షన్లకు చెందిన ఆర్టిసన్, అనుమ్యాన్, ఎస్పిఎం, పిసురేటు కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొని ఐక్యతను చాటుకున్నారు. కార్మికుల సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని స్థానిక ప్రజలు కూడా కోరుతున్నారు. కార్మికుల ఐక్యత □ ప్రభుత్వానికి హెచ్చరిక ఈ సమ్మె ద్వారా కార్మికులు తమ ఐక్యతను చాటుతూ, న్యాయం కోసం చివరి వరకు పోరాడతామని మరోసారి స్పష్టం చేశారు

## ఆరోగ్యానికి శ్రీరామరక్ష పీచు పదార్థం ధాన్యాల వర్గీకరణ



**డెస్క్,** ఆధునిక జీవనశైలిలో ఆహారపు అలవాట్లు వేగంగా మారుతున్న నేపథ్యంలో శరీరానికి అవసరమైన పోషకాలను అందించడంలో పీచు పదార్థం కీలక పాత్ర పోషిస్తోంది. పండ్లు, కూరగాయలు, సంపూర్ణ ధాన్యాలు మరియు పప్పుధాన్యాల్లో సమృద్ధిగా లభించే ఈ ఫైబర్ కేవలం జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా శరీరంలోని వ్యర్థాలను తొలగించడంలో అద్భుతంగా పనిచేస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడం, చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడం మరియు ఎక్కువ సేపు ఆకలి వేయకుండా చూస్తూ బరువు నియంత్రణకు ఇది తోడ్పడుతుంది. అయినప్పటికీ చాలా మంది తమ దైనందిన ఆహారంలో ఫైబర్‌కు తగినంత ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ధాన్యాలను వాటిలో ఉండే పీచు పదార్థం ఆధారంగా వర్గీకరించుకుని సరైన ఆహారాన్ని ఎంచుకోవడం ద్వారా దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని వారు స్పష్టం చేస్తున్నారు. ధాన్యాలన్నింటిలోకెల్లా బల్గర్ అధిక పీచు కలిగిన సంపూర్ణ ధాన్యంగా మొదటి స్థానంలో నిలుస్తోంది. ఇది జీర్ణ వ్యవస్థలో మేలు చేసే బ్యాక్టీరియాను పెంపొందించడంలో అగ్రగామిగా పనిచేస్తుంది. దీని తర్వాత స్థానంలో ఐరిష్ ఓట్స్ అని పిలవబడే స్టీల్ కట్ ఓట్స్ నిలుస్తున్నాయి, ఇవి బరువు తగ్గాలనుకునే వారికి అత్యుత్తమ ఎంపికగా మారుతున్నాయి. మూడవ స్థానంలో ఉన్న పర్ల్ బార్లీ సూపులు మరియు స్ట్యూల తయారీలో ఎక్కువగా ఉపయోగిస్తారు, ఇది మృదువైన టెక్స్చర్‌ను కలిగి ఉండటమే కాకుండా ద్రవాలను గట్టిపరిచే విశిష్ట గుణాన్ని కలిగి ఉంటుంది. దురదృష్టవశాత్తూ మనం నిత్యం తీసుకునే వైట్ రైస్, జాస్మిన్ మరియు బాస్మతి వంటి బియ్యం రకాల్లో పీచు పదార్థం చాలా తక్కువగా ఉంటుందని ఆరోగ్య గణాంకాలు చెబుతున్నాయి. కేవలం రుచికి ప్రాధాన్యత ఇచ్చి పాలిష్ చేసిన బియ్యాన్ని తీసుకోవడం వల్ల శరీరానికి అందవలసిన సహజ సిద్ధమైన ఫైబర్ లోపిస్తోంది. దీనివల్ల జీర్ణక్రియ మందగించడమే కాకుండా మధుమేహం వంటి వ్యాధులు త్వరగా సంక్రమించే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ అవుతున్నాయి. అందువల్ల సాధ్యమైనంత వరకు శుద్ధి చేసిన ధాన్యాలకు దూరంగా ఉండి సంపూర్ణ ధాన్యాలను అలవాటు చేసుకోవడం నేటి తక్షణ అవసరంగా మారింది. ఆహారంలో పీచు పదార్థాన్ని ఒక్కసారిగా కాకుండా క్రమక్రమంగా పెంచాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రతి వారం సుమారు ఐదు గ్రాముల చొప్పున ఫైబర్ పరిమాణాన్ని పెంచుతూ తగినంత నీరు త్రాగడం వల్ల శరీరం ఈ మార్పులకు త్వరగా అలవాటు పడుతుంది. భోజనం చేసిన తర్వాత తేలికపాటి నడక లేదా శారీరక కదలికలు చేయడం వల్ల జీర్ణ ప్రక్రియ సులభతరం అవుతుంది. ఫైబర్ కేవలం ఒక పోషకం మాత్రమే కాదని ఇది మొత్తం శరీర మెటబాలిజం ఆరోగ్యానికి వెన్నెముక వంటిదని గుర్తుంచుకోవాలి. ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం కావాలంటే పౌష్టికాహారం పట్ల అవగాహన పెంచుకోవడమే ఏకైక మార్గమని వైద్య నిపుణులు ఉద్ఘాటిస్తున్నారు.

## చియా గింజలతో బరువుకు కళ్లెం



**డెస్క్,** ఆధునిక ఆరోగ్య స్పృహ కలిగిన వారి ఆహారపు అలవాట్లలో చియా గింజలు ఒక భాగంగా మారిపోయాయి. ముఖ్యంగా బరువు తగ్గాలనుకునే వారికి ఇవి ఒక అద్భుతమైన ఎంపికగా నిలుస్తున్నాయి. చియా గింజలలో పుష్కలంగా ఉండే ఫైబర్, ప్రోటీన్ మరియు ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు శరీర మెటబాలిజంను వేగవంతం చేయడంలో సహాయపడతాయి. ఇవి జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా రక్తంలోని చక్కెర స్థాయిలను స్థిరీకరించడంలో తోడ్పడతాయి. అయితే ఈ గింజలను ఏ సమయంలో తీసుకుంటే గరిష్ట ప్రయోజనాలు లభిస్తాయనే అంశంపై ఆరోగ్య నిపుణులు ఆసక్తికరమైన సూచనలు చేస్తున్నారు. సరైన సమయంలో మరియు సరైన పద్ధతిలో వీటిని వినియోగించడం ద్వారా ఆశించిన ఫలితాలను త్వరగా పొందవచ్చని వారు వివరిస్తున్నారు. ఉదయం సమయంలో చియా గింజలను తీసుకోవడం వల్ల ఆ రోజంతా శరీరం ఉత్సాహంగా ఉండటమే కాకుండా, ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉంటుంది. దీనివల్ల మధ్య మధ్యలో అనవసరమైన చిరుతిళ్లు తినాలనే కోరిక తగ్గుతుంది, ఫలితంగా కేలరీల వినియోగం తగ్గి బరువు నియంత్రణలోకి వస్తుంది. అదేవిధంగా సాయంత్రం వేళ వీటిని తీసుకోవడం వల్ల రాత్రిపూట భారీగా భోజనం చేయాలనే తపన తగ్గుతుంది. ఇది నిద్రపోయే ముందు జీర్ణ వ్యవస్థపై భారాన్ని తగ్గించి, మరుసటి రోజు ఉదయం కడుపు తేలికగా ఉండేలా చేస్తుంది. మలబద్ధకం మరియు అజీర్ణం వంటి దీర్ఘకాలిక సమస్యలతో బాధపడేవారికి ఉదయం పూట చియా వాటర్ తీసుకోవడం ఎంతో మేలు చేస్తుంది. చియా గింజలను తీసుకునే విధానంపై కూడా నిపుణులు కొన్ని జాగ్రత్తలు సూచిస్తున్నారు. వీటిని ఎప్పుడూ నేరుగా పొడిగా తినకూడదు, ఎందుకంటే ఇవి ద్రవాలను పీల్చుకుని ఉబ్బే స్వభావాన్ని కలిగి ఉంటాయి. ఒక గ్లాసు నీటిలో ఒక టీస్పూన్ చియా గింజలను వేసి కనీసం 30 నిమిషాల పాటు నానబెట్టిన తర్వాతే తీసుకోవాలి. ఇలా నానబెట్టడం వల్ల అవి జెల్ లాంటి పదార్థంగా మారి శరీరానికి సులభంగా జీర్ణమవుతాయి. వీటిని కేవలం నీటితోనే కాకుండా పెరుగు, పాలు లేదా తాజా పండ్ల రసాలలో కలుపుకుని కూడా తీసుకోవచ్చు. చియా గింజలు వంటి ఆరోగ్యకరమైన ఆహారాలను అలవాటు చేసుకునే క్రమంలో మన చుట్టూ జరుగుతున్న పరిణామాలపై కూడా అప్రమత్తంగా ఉండటం అవసరం. పచ్చి పాలతో ఫేస్ మసాజ్ వంటి సహజ సిద్ధమైన చిట్కాలు మరియు కరివేపాకు వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుసుకోవడం ద్వారా ఆరోగ్యంతో పాటు అందాన్ని కూడా సంరక్షించుకోవచ్చు. ఏ పోషక పదార్థమైనా మితంగా మరియు సరైన పద్ధతిలో తీసుకున్నప్పుడే అది శరీరానికి మేలు చేస్తుంది. చియా గింజలు బరువు తగ్గడానికి గొప్పగా సహకరించినప్పటికీ, వాటితో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం మరియు సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల మాత్రమే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుంది. ముందస్తు అవగాహనతో కూడిన ఆహారపు అలవాట్లే ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు పునాది అని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# బంగారం ధరల షాక్



**హైదరాబాద్,** పసిడి కొనాలనుకునేవారికి భారీ షాక్ తగిలింది. దేశవ్యాప్తంగా బంగారం ధరలు ఒక్కసారిగా భారీగా పెరిగాయి. గుడ్ రిటర్న్స్ వివరాల ప్రకారం బుధవారం 24 క్యారెట్ల బంగారంపై 3,980 రూపాయలు, 22 క్యారెట్లపై 3,650 రూపాయలు, 18 క్యారెట్లపై 2,990 రూపాయలు పెరిగాయి. దీంతో మార్కెట్‌లో ధరలు గణనీయంగా ఎగబాకాయి.నిన్నటి వరకూ 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం సుమారు 1,49,840 రూపాయల వద్ద ఉండగా, ఇప్పుడు 1,53,820 రూపాయలకు చేరుకుంది. అలాగే 22 క్యారెట్ల బంగారం 1,41,000 రూపాయల వద్ద, 18 క్యారెట్ల బంగారం 1,15,370 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది. ఈ పెరుగుదలతో కొనుగోలుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇక వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. కిలో వెండిపై పది వేల రూపాయలు పెరిగి 2,65,000 రూపాయలకు చేరుకోగా, 100 గ్రాముల వెండి ధర 26,500 రూపాయలుగా నమోదైంది. బంగారం, వెండి ధరల ఈ పెరుగుదల మార్కెట్‌లో తీవ్ర చర్చకు దారి తీస్తోంది.ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ముంబై, బెంగళూరు వంటి ప్రధాన నగరాల్లో 24 క్యారెట్ల బంగారం ధర సుమారు 1,53,820 రూపాయల వద్ద కొనసాగుతోంది. ఢిల్లీ, చెన్నై వంటి నగరాల్లో మాత్రం కొద్దిగా ఎక్కువగా నమోదవుతోంది. ధరలు ఈ స్థాయిలో పెరగడంతో రాబోయే రోజుల్లో మార్కెట్ పరిస్థితులు ఎలా ఉంటాయనే ఆసక్తి నెలకొంది.

# మహీంద్రా ట్రాక్టర్ల ధరల పెంపు




**న్యూఢిల్లీ,** ప్రముఖ వాహన తయారీ సంస్థ మహీంద్రా అండ్ మహీంద్రా తమ ట్రాక్టర్ల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. ముడిసరుకుల ధరలు పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ తెలిపింది. కొత్త ధరలు ఏప్రిల్ 8 నుంచే అమలులోకి వచ్చినట్లు స్పష్టం చేసింది.ఈ ధరల పెంపు ట్రాక్టర్ మోడల్, విక్రయ ప్రాంతాన్ని బట్టి మారుతుందని కంపెనీ పేర్కొంది. అలాగే మహీంద్రా గ్రూపుకు చెందిన స్వరాజ్ ట్రాక్టర్ల ధరలు కూడా త్వరలో పెరగనున్నాయి. స్వరాజ్ బ్రాండ్ ట్రాక్టర్ల కొత్త ధరలు ఏప్రిల్ 21 నుంచి అమలులోకి రానున్నాయి.ఇనుము, ఉక్కు వంటి ముడిసరుకుల ధరలు అంతర్జాతీయ మార్కెట్లో పెరగడం వల్ల తయారీ వ్యయం అధికమైందని, అందువల్లే ధరలను సవరించాల్సి వచ్చిందని కంపెనీ తెలిపింది. గత కొంతకాలంగా వాహన రంగంలో ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది.ఈ పరిణామంతో ట్రాక్టర్లు కొనాలనుకునే రైతులపై అదనపు భారం పడే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పాత ధరల వద్ద కొనుగోలు చేయాలనుకునేవారు త్వరగా నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నారు.

# వడ్డీ రేట్లు యథాతథం




**ముంబై,**భారత రిజర్వ్ బ్యాంక్ కీలక వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పులు చేయలేదు. వరుసగా రెండోసారి కూడా రెపో రేటును యథాతథంగా ఉంచుతూ 5.25 శాతంగా కొనసాగిస్తున్నట్లు గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. ద్రవ్య పరపతి విధాన సమీక్ష అనంతరం ఈ నిర్ణయాన్ని ప్రకటించారు.దేశ ఆర్థిక పరిస్థితులపై ఆశావహ దృక్పథం వ్యక్తం చేసిన గవర్నర్, 2026-27 ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు 6.9 శాతంగా నమోదు కావచ్చని అంచనా వేశారు. దేశీయ వినియోగం బలంగా కొనసాగుతుండటం, పెట్టుబడులు పెరుగుతున్నాయి అనే అంశాలు వృద్ధికి అనుకూలంగా ఉన్నాయని పేర్కొన్నారు.అయితే అంతర్జాతీయ పరిస్థితులపై కొంత ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా చమురు ధరల పెరుగుదల ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపించే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రిటైల్ ద్రవ్యోల్బణం సుమారు 4.6 శాతంగా ఉండవచ్చని అంచనా వేశారు.ఇక దేశ విదేశీ మారక నిల్వలు కూడా బలంగా ఉన్నాయని గవర్నర్ పేర్కొన్నారు. ఏప్రిల్ ప్రారంభానికి అవి 696.1 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉన్నాయని తెలిపారు. మొత్తం మీద ఆర్థిక వ్యవస్థ స్థిరంగా కొనసాగుతోందని, కానీ గ్లోబల్ పరిణామాలపై జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని ఆర్బీఐ స్పష్టం చేసింది.

# స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగింపు



**ముంబై,** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం ట్రేడింగ్‌లో భారీ లాభాలతో ముగిశాయి. గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న ఉత్సాహం నేడు మరింత పెరిగింది. అంతర్జాతీయంగా అనుకూల పరిస్థితులు నెలకొనడం, దేశీయంగా ఆర్థిక పరిస్థితులు మెరుగుపడటం వల్ల పెట్టుబడిదారులు భారీగా కొనుగోళ్లు జరిపారు. దీంతో సెన్సెక్స్ 77,562 పాయింట్ల వద్ద ముగియగా, నిఫ్టీ 23,997 పాయింట్ల వద్ద స్థిరపడింది.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న యుద్ధ విరమణ నిర్ణయం మార్కెట్లకు పెద్ద ఊతమిచ్చింది. ప్రపంచవ్యాప్తంగా సానుకూల వాతావరణం ఏర్పడటంతో ఒక్క రోజులోనే పెట్టుబడిదారుల సంపద లక్షల కోట్ల రూపాయల మేర పెరిగింది. ముఖ్యంగా వాహన, రియల్టీ రంగాలకు చెందిన షేర్లు గణనీయంగా లాభపడ్డాయి.దేశీయంగా రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచిన నిర్ణయం కూడా మార్కెట్లపై సానుకూల ప్రభావం చూపింది. ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వం కొనసాగుతుందనే నమ్మకం పెట్టుబడిదారుల్లో పెరిగింది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, మార్కెట్లు ఈ జోరును కొనసాగించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# సాయి మార్తాండ్ కొత్త సినిమా ప్రకటన



**హైదరాబాద్,** చిన్న బడ్జెట్ సినిమాతో భారీ విజయాన్ని అందుకుని సినీ రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన దర్శకుడు సాయి మార్తాండ్ తన తదుపరి చిత్రంతో మరోసారి చర్చనీయాంశంగా మారాడు. తక్కువ ఖర్చుతో రూపొందించిన 'లిటిల్ హార్ట్స్' చిత్రంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆయన, ఇప్పుడు మరింత పెద్ద స్థాయిలో కొత్త ప్రయోగానికి సిద్ధమవుతున్నాడు.రెండు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మితమైన 'లిటిల్ హార్ట్స్' చిత్రం దాదాపు ముప్పై కోట్లకు పైగా వసూళ్లు సాధించడం విశేషం. ఈ విజయంతో సాయి మార్తాండ్ పేరు సినీ వర్గాల్లో విస్తృతంగా వినిపించింది. భావోద్వేగాలకు ప్రాధాన్యత ఇస్తూ, సాధారణ కథను ఆసక్తికరంగా చెప్పే ఆయన శైలి ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది.తాజాగా తన తదుపరి చిత్రంపై ఆయన స్పష్టత ఇచ్చాడు. ప్రముఖ నటుడు అడివి శేష్‌తో కలిసి కొత్త సినిమా చేయనున్నట్లు వెల్లడించాడు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'గూఢచారి 2' పూర్తయ్యాక ఈ చిత్రం ప్రారంభమవుతుందని తెలిపాడు. ఈ కథ ప్రేమ నేపథ్యంలో సాగుతుందని చెప్పడం ఆసక్తిని రేకెత్తిస్తోంది.ఈ చిత్రానికి సంబంధించి మరో ముఖ్య అంశం నిర్మాతల ఎంపిక. ప్రముఖ నటులు జగపతి బాబు, సునీల్ ఈ సినిమాతో నిర్మాతలుగా మారుతున్నారు. ఇప్పటివరకు నటులుగా మంచి గుర్తింపు పొందిన ఈ ఇద్దరు ఇప్పుడు నిర్మాణ రంగంలో అడుగుపెట్టడం విశేషంగా భావిస్తున్నారు. ఇది వారి కెరీర్‌లో ఒక కొత్త దశగా భావించవచ్చు.సాయి మార్తాండ్ కథనశైలికి తగ్గట్టుగా ఈ చిత్రం భావోద్వేగాలతో పాటు కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా ఉండే అవకాశముందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మరోవైపు థ్రిల్లర్ కథలతో గుర్తింపు పొందిన అడివి శేష్ ఈసారి ప్రేమకథలో నటించడం ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది.మొత్తానికి, చిన్న సినిమాతో పెద్ద విజయాన్ని అందుకున్న సాయి మార్తాండ్ ఇప్పుడు ప్రముఖ నటులతో కలిసి మరింత భారీ స్థాయిలో తన ప్రతిభను చూపించేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ కొత్త కాంబినేషన్ ఎలా ఉంటుందో, ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో అన్నది రాబోయే రోజుల్లో స్పష్టమవుతుంది.

# ఎన్టీఆర్-నీల్ షూటింగ్‌పై క్లారిటీ




**హైదరాబాద్,** యంగ్ టైగర్ ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కలయికలో రూపొందుతున్న ప్రతిష్టాత్మక చిత్రం షూటింగ్ రద్దయిందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని చిత్ర నిర్మాణ సంస్థ స్పష్టం చేసింది. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో ఈ సినిమా షూటింగ్ నిలిపివేశారని, ఎన్టీఆర్ కొత్త రూపం విషయంలో అసంతృప్తితో కార్యక్రమాలు ఆగిపోయాయని ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ప్రచారాలపై స్పందించిన నిర్మాణ సంస్థ, సినిమా చిత్రీకరణ సాధారణంగానే కొనసాగుతోందని తెలిపింది. ప్రస్తుతం తీసుకున్న విరామం తదుపరి భారీ కార్యక్రమాల కోసం చేసే సన్నాహాల కోసమేనని వెల్లడించింది. ఎన్టీఆర్ రూపం గురించి వస్తున్న వార్తలు పూర్తిగా ఆధారరహితమని పేర్కొంది. అధికారిక సమాచారం కోసం తమ ప్రకటనలనే నమ్మాలని చిత్రబృందం విజ్ఞప్తి చేసింది. ఇప్పటికే ఈ చిత్రం విదేశీ ప్రాంతాల్లో కీలక దృశ్యాలను పూర్తి చేసుకుంది. యాక్షన్ ప్రధానంగా సాగే ఈ చిత్రానికి ఎన్టీఆర్ ప్రత్యేకంగా శిక్షణ పొందుతున్నట్లు సమాచారం. ఈ చిత్రంపై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం తదుపరి కార్యక్రమాల కోసం చిత్రబృందం సిద్ధమవుతోంది.

# బుమ్రా వేసిన తొలి బంతినే సిక్సర్ సూర్యవంశీ సంచలనం



**గౌహతి,** రాజస్థాన్ రాయల్స్ యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించాడు. ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో జస్ప్రీత్ బుమ్రా వేసిన తొలి బంతినే సిక్సర్‌గా మలిచి తన ధైర్యాన్ని చాటాడు. కేవలం 14 బంతుల్లోనే 39 పరుగులు చేసి మ్యాచ్‌ను మలుపుతిప్పాడు. అతని ఇన్నింగ్స్‌లో అయిదు సిక్సర్లు, ఒక ఫోర్ ఉండటం విశేషం.వర్షం కారణంగా 11 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో సూర్యవంశీ, జైస్వాల్ కలిసి తొలి వికెట్‌కు 80 పరుగులు జోడించారు. జైస్వాల్ మొదటి ఓవర్‌లోనే 24 పరుగులు చేయగా, రెండో ఓవర్‌లో బుమ్రా వేసిన తొలి బంతిని సూర్యవంశీ మిడాన్ మీదుగా సిక్సర్‌గా పంపాడు. 131 కిలోమీటర్ల వేగంతో వచ్చిన ఆ బంతిని అతను నిర్భయంగా బౌండరీ దాటించడం ప్రేక్షకులను ఉర్రూతలూగించింది.అదే ఓవర్‌లో మరో సిక్సర్ బాదిన సూర్యవంశీ, బౌల్ట్, శార్దూల్ బౌలింగ్‌ల్లో కూడా భారీ షాట్లు ఆడాడు. తొలి బంతినే సిక్సర్ కొట్టడంతో ఒత్తిడి తగ్గిందని జైస్వాల్ పేర్కొన్నాడు. ఈ మ్యాచ్‌లో జైస్వాల్ 32 బంతుల్లో 77 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు.ఆర్ఆర్ జట్టు 11 ఓవర్లలో 150 పరుగులు చేయగా, లక్ష్య ఛేధనలో ముంబై జట్టు 123 పరుగులకే కుదేలైంది. ఈ విజయంతో రాజస్థాన్ జట్టు 27 పరుగుల తేడాతో గెలిచింది. యువ ఆటగాడు సూర్యవంశీ ప్రదర్శన ఈ మ్యాచ్‌కు హైలైట్‌గా నిలిచింది.

# పర్పుల్ క్యాప్ వేటలో ఐదుగురు

## అగ్రస్థానంలో బీసీసీఐకి నచ్చనోడు..!




**ముంబై,** ఐపీఎల్ 2026 సీజన్ రోజురోజుకూ మరింత ఉత్కంఠభరితంగా మారుతోంది. బ్యాటర్లు పరుగుల వర్షం కురిపిస్తుంటే, బౌలర్లు వికెట్లతో తమ ప్రతిభను చాటుతున్నారు. ముఖ్యంగా టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌కు లభించే ప్రతిష్టాత్మక పర్పుల్ క్యాప్ కోసం పోటీ హోరాహోరీగా సాగుతోంది. ప్రస్తుతం ఐదుగురు బౌలర్లు ఈ రేసులో ముందంజలో నిలిచి, అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నారు.ఈ జాబితాలో అగ్రస్థానంలో భారత యువ స్పిన్నర్ రవి బిష్ణోయ్ నిలిచాడు. రాజస్థాన్ జట్టు తరఫున ఆడుతున్న అతను ఈ సీజన్‌లో నిలకడైన ప్రదర్శన కనబరుస్తూ మూడు మ్యాచ్‌ల్లోనే ఏడు వికెట్లు సాధించాడు. అతని సగటు 11.71గా ఉండగా, ఎకానమీ 9.11గా ఉంది. తన స్పిన్ మాయాజాలంతో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెడుతూ పర్పుల్ క్యాప్ రేసులో అందరికంటే ముందంజలో కొనసాగుతున్నాడు.రెండో స్థానంలో అదే రాజస్థాన్ జట్టుకు చెందిన దక్షిణాఫ్రికా ఫాస్ట్ బౌలర్ నంద్రే బర్గర్ ఉన్నాడు. అతను తన వేగంతో బ్యాటర్లను కట్టడి చేస్తూ ఐదు వికెట్లు పడగొట్టాడు. అతని సగటు 15.20 కాగా, ఎకానమీ రేటు 8.44గా ఉంది. రాజస్థాన్ జట్టుకు చెందిన ఇద్దరు బౌలర్లు తొలి రెండు స్థానాల్లో ఉ ండటం ఆ జట్టు బౌలింగ్ దళం బలాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది.మూడో స్థానంలో పంజాబ్ జట్టు తరఫున ఆడుతున్న వైశాఖ్ విజయ్ కుమార్ ఉన్నాడు. 29 ఏళ్ల ఈ బౌలర్ మూడు మ్యాచ్‌ల్లో ఐదు వికెట్లు సాధించి తన ప్రతిభను నిరూపించాడు. అతని సగటు 14.40గా ఉండటం విశేషం. అదే సమయంలో నాలుగో స్థానంలో న్యూజిలాండ్‌కు చెందిన జాకబ్ డఫీ నిలిచాడు. బెంగళూరు జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ బౌలర్ కేవలం రెండు మ్యాచ్‌ల్లోనే ఐదు వికెట్లు సాధించడం గమనార్హం.ఇక ఐదో స్థానంలో చెన్నై జట్టు యువ బౌలర్ అన్షుల్ కంబోజ్ ఉన్నాడు. మూడు ఇన్నింగ్స్‌ల్లో బౌలింగ్ చేసి ఐదు వికెట్లు తీసిన ఈ యువకుడు తన ప్రతిభతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. అతని సగటు 24.40గా ఉంది. యువ ఆటగాళ్లు కూడా ఈ రేసులో నిలవడం ఈ సీజన్ ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.ప్రస్తుతం ఈ ఐదుగురు బౌలర్లు పర్పుల్ క్యాప్ కోసం గట్టి పోటీ ఇస్తున్నప్పటికీ, టోర్నీలో ఇంకా చాలా మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. కాబట్టి రాబోయే రోజుల్లో ఈ జాబితాలో మార్పులు రావడం ఖాయం. ప్రతి మ్యాచ్‌తో ఈ పోటీ మరింత ఉత్కంఠగా మారుతుండటంతో, చివరకు పర్పుల్ క్యాప్ ఎవరి తలపై నిలుస్తుందో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

Edited, Published & Owned by **BHUPATHI SANTHOSH.** Printed at PARAHUSHAR PRINTING PUBLICATIONS, H. NO. 1-6-27/2,SRI NAGAR COLONY, Mahabubabad,, TELANGANA-506101.
Published at Jammikunta, **KARIMNAGAR-TELANGANA**. EDITOR: BHUPATHI SANTHOSH. Cell: 9247819181 | **RNI No: TGTEL/25/A1882,**Email:Mana vaartha tg. Daily@gmail.com